రుణమాఫీ పై సీపీఐ(ఎం) సర్వే



నవతెలంగాణ-మునుగోడు

లక్ష లోపు రుణం తీసుకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ లిస్టును విడుదల చేయడంతో సీపీఐ(ఎం) బృందం గురువారం మండలంలోని కొంపెల్లి గ్రామంలో రుణమాఫీపై సర్వే నిర్వహించారు. రైతుల సమస్యలను, బ్యాంక్ అధికారుల సాంకేతిక లోపాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల సహాయ కార్యదర్శి వరికుప్పల ముత్యాలు మాట్లాడుతూ రుణమాఫీ అయినట్లు లిస్టులో పేరు వచ్చిన రైతులు బ్యాంక్ అధికారులను సంప్రదించి తిరిగి కొత్త రుణాలను పొందాలని రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని బ్యాంక్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

నవతెలంగాన-చిట్యాలటౌన్



గ్రామాలలో నాటిన ప్రతి మొక్కనూ గ్రామస్తులు సంరక్షించుకోవాలని మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో గురువారం నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆ గ్రామస్తులకు ఇంటింటికి ఆరు మొక్కల చొప్పున ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో జరిగే వన మహోత్సవం కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని మొక్కలను తీసుకెళ్లి ఇంటిలో నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం. సిద్ధి వీర సోమయ్య, డాక్టర్ మాధవి, ఫీల్డ్ అసిస్టెంట్ మర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



హామీలకు.. నిధులేవి..?

- పెండింగ్ ప్రాజెక్టులకు మొండి చేయి
- విద్య వైద్యంకు కేటాయించని నిధులు
- ఇండ్లు ఓకే... స్థల సేకరణ ఎలా
- వ్యవసాయ కార్మికులు కౌలు రైతుల పరిస్థితి ఏంటి?
- రాష్ట్ర బడ్జెట్ పై నేతల అభిప్రాయాలు



నవతెలంగాణ-మిర్యాలగూడ


గురువారం అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి ఉప ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడి గానే ఉందని రాజకీయ విశ్లేషకులతోపాటు ఆయా పార్టీల నాయకులు అభిప్రాయపడుతున్నారు ప్రధానంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న ప్రాజెక్టుల పూర్తి కోసం నిధులు కేటాయించలేదు శ్రీశైలం సొరంగ మార్గం పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించలేదు. అదేవిధంగా డిండి ఎత్తిపోతల పథకంకు నిధులు కేటాయించకపోవడంతో ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రైతులను ఆదుకుంటున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించకపోవడం విస్మయం కలిగిస్తుంది. పేదలకు సొంతటికల నెరవేరస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది దానిని అమలు చేసేందుకు నియోజకవర్గానికి 3500 ఇల్లు నిర్మిస్తామని బడ్జెట్లో ప్రకటించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 42 వేల ఇండ్లు ఈ సంవత్సరం నిర్మిస్తామని ప్రకటించినప్పటికీ దానికి అవసరమైన స్థల సేకరణ ఎప్పటి వరకు పూర్తి చేస్తారనే విషయాన్ని స్పష్టత ఇవ్వకపోవడం పట్ల పక్కా ఇండ్లు వస్తాయా లేదా అనే అనుమానాలు కలుగుతున్నాయి. అదేవిధంగా ప్రధానంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ, మెడికల్ కాలేజ్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించలేదు. దీంతో విద్య, వైద్య రంగాల పట్ల నిర్లక్ష్యం వహించారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 6 గ్యారంటీ హామీల అమలుపై కూడా స్పష్టత కొరవడింది. హామీలు అమలు కోసం నిధులు ఎలా కేటాయిస్తారే అనే విషయం కూడా ప్రస్తావించలేదు. అదేవిధంగా ఆయా సామాజిక వర్గాల కార్పొరేషన్ల నిధులు కేటాయింపులు కూడా నిర్లక్ష్యం జరిగిందని స్పష్టంగా అర్థమవుతుంది. దీంతో యువతకు స్వయం ఉపాధి కల్పించడంలో ఈ బడ్జెట్లో ప్రస్తావన లేకపోవడంతో యువతలో నిరాశ ఎదురైంది. సంఘటిత అ సంఘటితంగా కార్మికులకు భరోసా ఇచ్చే విధంగా ఈ బడ్జెట్లో ఎలాంటి నిధులు కేటాయించలేదు. ఈ బడ్జెట్ కేవలం అంకెలగారడిగానే ఉందని కేటాయించిన నిధులు ఖర్చు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని అన్ని వర్గాల ప్రజలు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర బడ్జెట్ పై ఆయా పార్టీల నేతల అభిప్రాయాలు వారి మాటల్లోనే......

కేటాయించిన బడ్జెట్ అంకెలను ప్రజా సంక్షేమానికి ఖర్చు చేయాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



గత ప్రభుత్వం మాదిరిగానే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కూడా వెనుకబడిన ప్రాంతాలను విస్మరించినట్లుగా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీల అమలుపై ఉన్న చిత్తశుద్ధి మిగిలిన ప్రజా సమస్యలపై లేదన్నారు. రైతు భరోసా, రైతు భీమా ఎప్పటి వరకు ఏ రకంగా అమలు చేస్తారో నిర్దిష్టంగా బడ్జెట్లో పేర్కొనలేదన్నారు. ముఖ్యంగా సాగునీటి రంగంలో పెండింగ్‌లో ఉన్న శ్రీశైలం సొరంగం మార్గాన్ని పూర్తి చేసేందుకు తగిన నిధులు కేటాయించాలి.మూసీ ప్రాజెక్టు ఆధునీకరణకు పర్యాటక రంగంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదిస్తామని ఎలాంటి ప్రకటన చేయకపోవడం అత్యంత బాధాకరం. వ్యవసాయ కార్మికులను, కౌలు రైతులను ఏరకంగా ఆదుకుంటారో కూడా చెప్పలేదు. నియోజకవర్గానికి 3500 గృహ నిర్మాణాలు చేపట్టితే ఇండ్లు లేని నిరుపేదల వరకు ఎప్పటి వరకు పూర్తవుతాయని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలి. అన్ని రకాల వృత్తిదారుల, దళిత, గిరిజన, మైనార్టీల అభివృద్ధికి కృషి చేయాలి. అన్ని ప్రభుత్వ ప్రయివేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేసేందుకు ఆరోగ్యశ్రీలో చేర్చాలి. గ్రామీణ పేదలను ఆదుకొనుటకు ప్రభుత్వం తగినన్ని సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా అభివృద్ధి సాధ్యం. మహాత్మాగాంధీ యూనివర్శిటీ, మెడికల్ కాలేజీలకు తగిన నిధులు కేటాయించలేదు. ప్రజాపాలనలో ఆర్జీలు వచ్చాయని చెప్పారే తప్పా వాటిని ఏ రకంగా పరిష్కరిస్తారో వివరించలేదు. మొత్తంగా బడ్జెటును పరిశీలిస్తే రాబడికి పోబడికి తేడా ఉంది. ఖర్చులకు తగ్గట్లుగా ఆదాయం ఏరకంగా సమకూర్చుకుంటారో బడ్జెట్లో చెప్పలేదు. గత ప్రభుత్వం అంకెల్లో కేటాయింపులు చేసి ఖర్చులు పెట్టలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన అంకెలను ఖర్చు చేయాలి. నిర్దిష్టంగా బడ్జెట్ ప్రజాసంక్షేమానికి, ప్రజల అవసరాల తగ్గట్టుగా కేటాయించి ఖర్చు చేయాలి. లేని ఎడల ప్రజలను సమీకరించి నిర్మాణాత్మక పోరాటాలు చేస్తాం.

పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేదు

సీపీఐ జిల్లా కార్యదర్శి నేలికంటి సత్యం

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీల పై చిత్తశుద్ధి తో కొంత మేరకు నిధులు కేటాయించారు. గత కెసిఆర్ ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వంలో సాగునీటి రంగాలకు ప్రాధాన్యత కనిపించింది. జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు ఎస్ఎల్బిసి సొరంగ మార్గం పూర్తికి ప్రత్యేక నిధులు కేటాయించలేదు.గత ప్రభుత్వంలో శ్రీశైలం సొరంగ మార్గం నక్కలగండి,డిండి ఎత్తిపోతల పథకం, చర్లగూడెం రిజర్వాయర్ పై చూపిన వివక్షకు భిన్నంగా ప్రాధాన్యతనిస్తూ నిధులను కేటాయించాల్సి ఉంది. విద్య వైద్యం కోసం కూడా సరైన నిధులు కేటాయించలేదు. ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ నిధులు ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించాలి.

జన రంజక బడ్జెట్

కేతావత్ శంకర్ నాయక్ ,డీసీసీ అధ్యక్షులు నల్గొండ

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణకు మొండి చేయి చూపించింది. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ప్రభుత్వం. 6 గ్యారంటీలపై ఫోకస్ పెట్టింది. పింఛన్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీ, ద్వారా పేదలకు మరింత మేలు జరుగుతుంది. గత పది సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులన్నింటినీ సంవత్సరకాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పూర్తి కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఉంది. పేదలకు మంచి చేసే, జనారంజక మైన బడ్జెట్ ఇది.

సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు



బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. ఇది కార్మికులు, కర్షకులకు వ్యతిరేకమైన బడ్జెట్. గిరిజనులకు బడ్జెట్లో నిధులు తగ్గించారు. కొత్తదనం ఏమీ లేదు. కొత్త స్కీములు లేవు. ముఖ్యంగా రైతులను నట్టేట ముంచారు. రైతుబంధు గూర్చి ఏమి చెప్పలేదు. రుణమాఫీపై క్లారిటీ లేదు. ప్రాజెక్టులపై కూడా ఏమి చెప్పలేదు. కార్మిక, కర్షకులు, గిరిజన, హరిజన, వెనుకబడిన తరగతుల వ్యతిరేక బడ్జెట్

ముసురుతో...విషజ్వరాలు



నవతెలంగాణ-నకిరేకల్

వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు ఇండ్లలో, వీధులలో నీరు నిలువ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలుతున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రజలు పదుల సంఖ్యలో విష జ్వరాల బారిన పడి సతమతమవుతున్నారు. దీనికి భిన్నంగా మండలంలోని మంగళపల్లి గ్రామంలో ఇంటింటికి విష జ్వరాలు ప్రబలడంతో అక్కడి ప్రజలు మనోధైర్యాన్ని కోల్పోతున్న పరిస్థితి ఉంది. గ్రామాల్లో ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగియడంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నిధులు లేక గ్రామ కార్యదర్శులు చేతులెత్తేస్తున్న పరిస్థితి ఉంది.

మండలంలోని మంగళపల్లి గ్రామంలోని కాకుండా మిగిలిన గ్రామాల్లో కూడా విష జ్వరాలు ప్రబలుతున్నాయి. అధికారులు పారిశుధ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరముంది. మండలంలోని అన్ని గ్రామాల్లో పదుల సంఖ్యలో విష జ్వరాలు ప్రబలి ఇబ్బందులు పడుతున్నారు. మంగళపల్లిలో నీటి నిల్వలతోనే విషజ్వరాలు ప్రబలుతున్నాయని ప్రాథమికంగా జిల్లా వైద్యాధికారులు గుర్తించారు. వైద్య సిబ్బంది ఆయా గ్రామాలలో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించి వారు రోగాల బరిన పడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

మంగళపల్లి లో రెండో రోజు కొనసాగుతున్న వైద్య శిబిరం

మంగళపల్లి గ్రామంలో ఒగోడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం కొనసాగుతుంది. గ్రామంలో బుధవారం 71 మంది శిబిరానికి హాజరు కాగా 26 మందికి జ్వరం ఉన్నట్లు గుర్తించారు. 44 మంది నుండి రక్త నమూనాలను సేకరించారు. మరో ముగ్గురిని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. అదేవిధంగా గ్రామంలోని మురికి కాలువలు, నీటి నిలువల వద్ద యాంటీ లార్వల్ పిచికారి చేశారు.

అన్ని గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నాం : యోగస్వి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, ఒగోడు



మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఆరోగ్య సిబ్బందితో సర్వే నిర్వహిస్తున్నాం. ఏఎన్ఎంలు, ఆశాలు కలిసి సర్వే నిర్వహిస్తున్నారు. అన్ని గ్రామాల్లో ప్రజలను నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని చైతన్యం చేస్తున్నాం. జ్వరాలు వస్తే ప్రజలు భయభ్రాంతులకు గురి కావద్దు. మంగళపల్లి గ్రామంలో చికెన్ గున్యా, డెంగ్యూ లాంటి వ్యాధుల నిర్ధారణ కాలేదు. మరో ఆరుగురికి సంబంధించిన రక్త నమూనాలను హైదరాబాద్‌కు పంపించాం. మరో మూడు నాలుగు రోజుల్లో రిపోర్టులు వస్తాయి. ఇంటి పరిసర ప్రాంతాలలో దోమలు పెరగకుండా ప్రజలు తగిన చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలి.

ఆగస్టు 15 నాటికి పనులు పూర్తి చేయాలి

- చెరువుగట్టు దేవాలయంలో మౌలిక సదుపాయాల కల్పనకు శాశ్వత ప్రణాళికలు

కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నవ తెలంగాణ- నార్కట్ పల్లి



ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన పనులన్నీ ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. మండలంలోని ఎల్లారెడ్డి గూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు .పాఠశాల తరగతి గదులు ,వంటగది, తాగునీటి సౌకర్యం, ప్రహరీ ,పాఠశాల ఆటస్థలం, టాయిలెట్స్ తదితర సౌకర్యాలను పరిశీలించి వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసు కున్నారు. పాఠశాలలో టాయిలెట్స్ తో పాటు, తాగునీటి మరమ్మతులు, తరగతి గదుల మరమ్మతు పనులు చేపట్టడం తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు, సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

విద్యార్థులు 10 జీపీఏ సాధించాలి

ప్రైవేట్ పాఠశాలల మాదిరిగానే ప్రభుత్వ పాఠశాలలో సైతం విద్యార్థులు 10 జీపీఏ వచ్చే విధంగా కష్టపడి చదవాలని కలెక్టర్ సూచించారు. పదవ తరగతి గదిలోకి వెళ్లి బయోలాజికల్ సైన్స్ పాఠం జరుగుతుండగా, డిజిటల్ విధానం ద్వారా పిల్లల పరిజ్ఞానాన్ని, డిజిటల్ బోధన తీరును ఆయన పరిశీలించారు. విద్యార్థుల తో ముఖాముఖి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ, మండల ప్రత్యేక అధికారి నాగిరెడ్డి ,పంచాయతీరాజ్ ఈఈ భూమన్న, డిప్యూటీ ఇంజనీర్ మహేష్ ఎంపీడీవో ఉమేష్ , మండల విద్యాధికారి కూకుట్ల నరసింహ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువుగట్టు దేవాలయంలో మౌలిక సదుపాయాల కల్పనకు శాశ్వత ప్రణాళికలు

చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు కలెక్టర్ కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దేవాలయ అధికారులతో పాటు ,వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. దేవాలయానికి ప్రతిరోజు , ప్రతి అమావాస్యకు, అదేవిధంగా ప్రతి సంవత్సరం నిర్వహించే జాతరకు లక్షలాది భక్తులు తరలివస్తారని ఆలయ అధికారులు తెలిపారు. వీరందరికీ సరిపోయే విధంగా రవాణా సౌకర్యం, తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్తు వంటి సౌకర్యాల పై కలెక్టర్ ఆరా తీశారు. చెరువు గట్టు పైకి వచ్చే రహదారులను డబుల్ రోడ్డు చేసేందుకు, ఘాట్ రోడ్డు డబుల్ రోడ్డు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కింది నుండి చెరువుగట్టు పైకి నీటి పైప్ లైన్ తోపాటు, డిస్ట్రిబ్యూషన్ విధానాన్ని పక్కాగా ఏర్పాటు చేసేందుకు, టాయిలెట్స్ సంఖ్య పెంచేందుకు ప్రణాళికలను రూపొందించాలన్నారు. విద్యుత్తు సరఫరా పై సైతం కలెక్టర్ సమీక్షించారు.

ఖర్చులు తగ్గించాలి

దేవాలయ ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు, ఖర్చులు తగ్గించడంపై దృష్టి సారించాలని, సిబ్బంది బాధ్యతగా పనిచేసే విధంగా చూడాలని, ఉన్నవారితో సాధ్యమైనంత వరకు మంచి పని తీసుకోవాలన్నారు. వీటన్నిటినిపై ప్రణాళికలు రూపొందించలని వచ్చే గురువారం మరోసారి సమీక్షించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మహేంద్ర కుమార్, ఆలయ ఈవో నవీన్ కుమార్, మండల ప్రత్యేక అధికారి, డిఆర్డిఓ నాగిరెడ్డి, పంచాయతీరాజ్ ఈ ఈ భూమన్న, ఎంపీడీవో ఉమేష్, పాల్గొన్నారు.

రైతు బీమా కు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-నకిరేకల్

2024 సంవత్సరానికి అర్హులైన రైతులంతా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ ఏ. లింగయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని పాలెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆ గ్రామంలో దరఖాస్తు చేసుకునే అర్హత కలిగిన రైతుల జాబితాను నోటీసు బోర్డుపై అంటించి రైతులతో మాట్లాడారు. మండలంలోని నోముల, ఒగోడు, నడిగూడెం, వల్లభాపురం, పాలెం గ్రామాల రైతుల జాబితాను ఆయా గ్రామపంచాయతీ నోటీసు బోర్డులలో ప్రదర్శించినట్లు తెలిపారు హరహత కలిగిన రైతులంతా ఆగస్టు 5వ తేదీ వరకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి పర్యటన

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుక్రవారం నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు హైదరాబాద్ నుండి బయలుదేరి 10 గంటలకు నల్లగొండ చేరుకుంటారు.మధ్యాహ్నం 12 గంటలకు నల్లగొండ మండలం దొనకల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 33/11 కెవి సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 1 గంటలకు నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనాన్ని తనిఖీ చేసి, నిర్మాణ పనులపై అధికారులతో రివ్యూ చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కౌన్సిల్ సమావేశంలో పాల్గొంటారు.

వృత్తిదారుల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్

- తెలంగాణ చేతి వృత్తిదారుల సమన్వయ సంఘం రాష్ట్ర నాయకులు బండా శ్రీశైలం, జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



జూలై 23న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వృత్తిదారుల సంక్షేమాన్ని విస్మరించిందని, తెలంగాణ చేతి వృత్తిదారుల సమన్వయ సంఘం రాష్ట్ర నాయకులు బండా శ్రీశైలం, జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్ ఆరోపించారు. గురువారం దొడ్డి కొమరయ్య భవన్లో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో చేనేత, మత్స్య పరిశ్రమల అభివృద్ధికి అతి తక్కువ నిధులు కేటాయించడం విచారకరమన్నారు. దేశంలో వ్యవసాయం తర్వాత రెండో ప్రధాన రంగమైన చేనేతకు చేయూతనిస్తామని బిజెపి ఎన్నికలకు ముందు బడ్జెట్లో 5000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి నేడు అతి తక్కువ 200 కోట్లు కేటాయించడం విచారకరమన్నారు. గత ఏడాది 250 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ బడ్జెట్లో 50 కోట్లు తగ్గించారు. దేశవ్యాప్తంగా 1.83 కోట్ల జనాభా కలిగిన చేనేత కార్మికులకు పనిలేక నేసిన వస్త్రాలు విక్రయం కాక అర్ధాకలితో అలమటిస్తూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత సంక్షేమ పథకాలు అంతంతమాత్రంగానే అమలవుతున్నాయని ప్రస్తుతం చేనేతకు 200 కోట్లు మాత్రమే కేటాయించడంతో కొత్త సంక్షేమ పథకాలు రాకపోగా గతంలో ఉన్న సంక్షేమ పథకాలకు కూడా మంగళం పాడే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బడ్జెట్ సవరణ చేసి చేనేత ఇతర వృత్తిదారుల సంక్షేమం కోసం 30 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమన్వయ కమిటీ జిల్లా నాయకులు కొండ వెంకన్న, అవిశెట్టి శంకరయ్య, మురారి మోహన్, చెరుకు పెద్దలు, జేరిపోతుల ధనంజయ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-మిర్యాలగూడ



అప్పుల బాధ తాళలేక రైతు పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన రాయికింది గోపాల్ (54) తనకున్న రెండు ఎకరాల వ్యవసాయ ఖర్చులతోపాటు వ్యాపార నిమిత్తం కొందరి వద్ద అప్పులు తీసుకున్నాడు. అప్పులు ఇచ్చిన వారు నిత్యం ఒత్తిడి చేస్తుండడంతో ఇటీవల తనకున్న ఆస్తిని అమ్మి అయినా ఇస్తానని నచ్చజెప్పినా అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడికి గురి చేస్తుండడంతో గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. పురుగుల మందు తాగేముందు డబ్బులను తిరిగి ఇవ్వమని వేధిస్తున్న వారి పేర్లు సైతం సూసైడ్ నోట్‌లో రాసి ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు తెలిపారు. మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు.మృతునికి భార్య, ముగ్గురు సంతానం కాగా చిన్న కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

స్మిత సబర్వాల్ ను వెంటనే బర్తరఫ్ చేయాలి

నవతెలంగాణ- నల్లగొండ కలెక్టరేట్

వికలాంగుల అనుచిత వ్యాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారిని స్మిత సబర్వాల్ వెంటనే బర్తరఫ్ చేయాలని ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రావ్ గృహం వద్దస్మిత సబర్వాల్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ కొమ్ము హరికుమార్ , జిల్లా కో కన్వీనర్లు వీరబోయిన సైదులు యాదవ్, తగుళ్ల వెంకన్న, మహిళా విభాగం అధ్యక్షురాలు చైతన్య రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల జలంధర్, ఎమ్మార్పీ భూష్పాక రణవీర్, జిల్లా కార్యదర్శి తరి ఏడుకొండలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో డీటీఎఫ్ ముందంజ

నవతెలంగాణ-మద్దిరాల



ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో డీటీఎఫ్ ముందంజలో ఉంటుందని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రేపాక లింగయ్య అన్నారు. మద్దిరాల మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమం లో ఆయన ఎమాట్లాడారు. వృత్తి నిబద్ధత, సామాజిక బాధ్యతతో నిజాయితీగా పనిచేస్తున్న ఏకైక ఉపాధ్యాయ సంఘం డీటీఎఫ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జి రాములు, ప్రధాన కార్యదర్శి బి. దేవేందర్, సీనియర్ నాయకులు దండు వెంకట నారాయణ మండల నాయకులు బుస్సా వెంకటేశ్వర్లు, నకిరేకంటి వెంకన్న, వై. చంద్రశేఖర్ రెడ్డి, బొప్పని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉండాలి

నవతెలంగాణ-మఠంపల్లి



ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులు సక్రమంగా ఉండాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష అన్నారు. గురువారం కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2021 నుంచి 2024 వరకు అన్ని రికార్డులు పెండింగ్లో ఉన్నాయని, పెండింగ్లో ఉన్న రికార్డులను ఆడిట్ చేయించి అధికారులకు సబ్మిట్ చేయాలని చెప్పారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో గ్రామ కార్యదర్శులు అందరూ అందుబాటులో ఉండి శానిటేషన్ పనులు ఎప్పటికప్పుడు చేయించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.వీరి వెంట ఇన్చార్జి ఎంపీడీవో ఆంజనేయులు రిటైర్డ్ ఎంపీడీవో జానకి రాములు ఉన్నారు.

సంక్షేమ రంగాల ప్రాధాన్యతను గుర్తించాలి

- కేటాయించిన బడ్జెట్ను ఖర్చు చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

2024-25 రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయం, దళిత, గిరిజన, విద్యా, వైద్య రంగాలకు కేటాయింపులను స్వాగతిస్తున్నామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి గురువారం ఒక ప్రకటనలో అన్నారు. గత 10 సంవత్సరాలలో కేటాయింపులు జరిగినప్పటికీ పూర్తిగా ఖర్చు చేయలేదన్నారు. దళిత, గిరిజన ఉప ప్రణాళికలో ఏనాడూ 60 శాతానికి మించి వ్యయం చేయకపోవడం వల్ల ఆ వర్గాలు దారిద్ర్యం నుంచి బయటపడలేదన్నారు. అందువల్ల ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులను పూర్తిగా ఖర్చు చేయాలని కోరారు. వ్యవసాయ రంగంలో రైతు రుణమాఫీ, రైతుభరోసా, రైతుభీమాతో పాటు, వ్యవసాయ పరిశోధనలకు రూ.72659 కోట్లు కేటాయింపులు చేశారని, విద్యా, వైద్యానికి చేసిన కేటాయింపులు గతంలాగే ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అక్షరాస్యత 66శాతం దాటడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షరత మిషన్ లాంటి పథకాలను తొలగించడం, ప్రభుత్వ పాఠశాలలకు భవనాలు, ఇతర సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రయివేటు విద్యాలయాలకు ఆకర్షించబడుతున్నాయన్నారు. వైద్యరంగానికి కేటాయించిన నిధులు కూడా బస్తీ దవాఖానాలకు, గ్రామ దవాఖానాలకు, ప్రభుత్వ ఆసుపత్రులకు సరిపోవని పేర్కొన్నారు. విద్యా, వైద్య రంగంలో ప్రభుత్వాలు తగు శ్రద్ధ చూపకపోవడంవల్ల ప్రయివేటు రంగాలకు ఆకర్షించబడుతున్నారని తెలిపారు. ఈ రెండు రంగాలకు కేటాయింపులు పెంచాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రస్తుత బడ్జెట్లో ఇండ్ల నిర్మాణానికి బీసీలకు రూ. 5లక్షలు, దళితులకు రూ. 6లక్షలు ఇస్తామని, నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయిస్తామని ప్రకటించారని, దీనికి రూ.8424 కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. వాస్తవానికి రాష్ట్రంలో లక్షల మంది ఇండ్లు లేనివారు దశాబ్దాల తరబడి ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అర్హతగల ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేసి ఇండ్ల నిర్మాణానికి కనీసం రూ. 10లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకనుగుణంగా బడ్జెట్ను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి జాబ్ క్యాలెండర్ను వెంటనే విడుదల చేయాలని, మహిళలకు రూ.1లక్ష ఆర్థిక సహాయాన్ని వడ్డీలేకుండా రూ.2లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి అన్యాయం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ



నవతెలంగాణ-సూర్యాపేట

తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ విమర్శించారు. బడ్జెట్లో విద్యారంగానికి అన్యాయాన్ని నిరసిస్తూ గురువారం స్థానిక 60 ఫీట్రోడ్లో ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.3శాతం మాత్రమే కేటాయించారని ఇది గత ఓటాన్ బడ్జెట్లో కేటాయించిన బడ్జెట్ కంటే తక్కువగా ఉందన్నారు.గత బడ్జెట్లో విద్యారంగానికి 21,389 కోట్ల రూపాయలు కేటాయించగా ప్రస్తుతం 21,292కోట్లు కేటాయించారన్నారు. తక్షణమే బడ్జెట్ సవరించి విద్యారంగానికి నిధులను పెంచి ప్రభుత్వ విద్యారంగాని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భానోత్ వినోద్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అక్కనపల్లి వినయ్, వేణు, అరుణ్, సాయి ,గోపి ,నవ్య ,సౌజన్య, మమత శిల్పా తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడుచర్ల



అధిక ధరలకు ఎరువులు పురుగు మందులు అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్ని మండల వ్యవసాయ అధికారి ఎస్కే జావేద్తో కలిసి తనిఖీ నిర్వహించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు స్టాక్ రిజిస్టర్ ను ప్రతిరోజు అప్డేట్ చేయాలని, ధరల పట్టికలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. వ్యవసాయ అధికారి కార్యాలయానికి వచ్చిన రైతులకు రుణమాఫీకి సంబంధించి సలహాలు, సూచనలు తెలిపారు. ఎవరికైతే లక్ష లోపు రుణమాఫీ ఉండి, ప్రస్తుతానికి రుణమాఫీ కానీ వాళ్లకి ప్రభుత్వం నుంచి సూచనలు వచ్చిన వెంటనే వారి వివరాలు ఆన్లైన్లో నమోదు చేస్తామన్నారు.ప్రస్తుత వానాకాలం సీజన్ పంటకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతు బీమా పథకానికి సంబంధించి 18 నుండి 59 ఏండ్ల గల రైతులందరూ వ్యవసాయ అధికారి కార్యాలయంలో వెంటనే నమోదు చేసుకోవాలన్నారు.

కేటాయింపులు ఘనం ..ఖర్చు సంగతేంటి?

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు



నవతెలంగాణ-సూర్యాపేట

శాసనసభలో రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 2024-2025 బడ్జెట్లో కేటాయింపులు ఘనంగా ఉన్నాయని, కేటాయించిన బడ్జెట్ను చిత్తశుద్ధితో ప్రభుత్వం ఖర్చు చేయాలి. 2,91,159 కోట్లతో రూపొందించిన బడ్జెట్లో ప్రజా పంపిణీ, ఇండ్ల నిర్మాణానికి, విద్య, వైద్యానికిబడ్జెట్ లో ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. బడ్జెట్లో వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 12,000 వేల రూపాయలు ఇస్తామని ప్రకటించారని, దానిని ఎప్పటినుండి అమలు చేస్తారో స్పష్టంగా పేర్కొనలేదు. కోట్లాదిమందికి ఉపాధి కలిగించే ఉపాధి హామీకి బడ్జెట్లో నిధులు పెంచలేదు. బడ్జెట్లో వృద్ధులు, వితంతువులు, వికలాంగుల, ఇతర సామాజిక పింఛన్ పెంపు ప్రస్తావన లేదు. మహాలక్ష్మి పథకానికి కేటాయింపులు లేకపోవడం మహిళలని మోసం చేయడమే.

మమ్మల్ని సస్పెండ్ చేయండి మహాప్రభో

- ఉపాధ్యాయులు బదిలీ కోసం.. బడులకు దుమ్మా
- జూన్ నుండి విధులకు గైర్హాజరు
- సస్పెండ్ కావడం కోసం విధులకు గైర్హాజరు అవుతున్న పంతుల్లు
- విద్యార్థులకు అంగన్వాడీ టీచర్లే దిక్కు
- పంతులును కేటాయించాలని ఎంఈఓకు ఫిర్యాదు



నవతెలంగాణ-తుంగతుర్తి

నేటి బాలలను రేపటి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే. ఉత్తమ గురువులే ఉత్తమమైన పౌరులను సమాజానికి అందిస్తారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూ ఉద్యోగంలో సస్పెన్షన్కు గురికాకుండా ఉద్యోగం చేయడం ఉద్యోగి కర్తవ్యం, కానీ అందుకు భిన్నంగా తాము సస్పెండ్ కావడం కోసమే ఉన్నత అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధుల పట్ల గైర్హాజరు అవుతున్న విచిత్ర మనస్తత్వం ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు మండలంలో పనిచేస్తున్నారు. వెలుగుపల్లి కాంప్లెక్స్ పరిధిలోని బండరామారం ప్రాథమిక పాఠశాలకు చెందిన వెంకట్ రాములు, జేత్యతండకు చెందిన పి సత్యమూర్తి ఇద్దరు ఉపాధ్యాయులు తరచుగా విధులకు గైరాజరవుతున్నారు. దీంతో ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలకు జూన్ నుండి విధులకు హాజరు కాలేదు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓ కార్యాలయానికి చేరుకొని మా పాఠశాలకు ఉపాధ్యాయులు రావడంలేదని ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈఓ తన కార్యాలయంలో పనిచేస్తున్న సిఆర్పిలను గత నెల రోజుల నుండి పంపుతున్నారు. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులకు సెలవు కావాలంటే ప్రధానోపాధ్యాయుడి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఆ తరువాత ఎక్కువ రోజులు సెలవులు కావాలంటే మండల విద్యాశాఖ అధికారి అనుమతి తప్పనిసరి, కానీ ఈ ఇరువురు ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయునితో పాటు మండల విద్యాశాఖ అధికారి అనుమతి లేకుండా దర్జాగా విధులకు గైరాజరావుతున్నట్లు సమాచారం. దీంతో అట్టి ఉపాధ్యాయులను గైర్హాజరు కావడానికి సంజాయిషీ నోటీసులు ఇచ్చినా వారు పట్టించుకోకపోవడంతో తప్పని పరిస్థితుల్లో వారి యొక్క వేతనాలు ఆపినట్లు ఎంఈఓ తెలిపారు. వీరి గైర్హాజర్ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియపరచినట్లు ఎంఈఓ తెలుపుతున్నారు. ఇందులో ఒక ఉపాధ్యాయుడు జేత్యతండాలో పనిచేస్తున్నారు. అక్కడ ఒకే ఒక ఉపాధ్యాయుడిగా ఉన్న సత్యమూర్తి కూడా విధులకు హాజరు కాకపోవడంతో అట్టి పాఠశాల విద్యార్థులకు అంగన్వాడీ టీచర్లే పెద్ద దిక్కుగా మారారు. ఈ ఇద్దరు ఉపాధ్యాయులను ఇదేమని ప్రశ్నిస్తే తాము ఇక్కడ పనిచేయడం ఇష్టం లేదని సస్పెండ్ చేస్తే మళ్లీ వేరే ప్రాంతంలో ఉద్యోగం చేయొచ్చనే ఆలోచనలో ఉన్నామని తమ సహచరుల దగ్గర వాపోతున్నట్లు సమాచారం. సస్పెండ్ అయితే మళ్లీ రెండు నెలల అనంతరం తమ మండలంలోని ఏదో ఒక గ్రామంలో పనిచేసేందుకు అవకాశం ఉంటుందని చెప్తున్నట్లు సమాచారం. విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పి, సమాజం పట్ల అవగాహన కల్పించాల్సిన ఉపాధ్యాయులే విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ పాఠశాల విధులను విస్మరించి ఉండడం పట్ల ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను బడికి పంపడానికి వెనుకంజ వేస్తున్నారు.

గతంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు తాము పని చేసే గ్రామాల్లో నివాసం ఉంటూ గ్రామంలోని పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పేవారు. మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయుల్లో మార్పు వచ్చింది. పట్టణాలు,నగరాల నుంచి నిత్యం రాకపోకలు కొనసాగిస్తూ,కొత్త జీవన విధానానికి అలవాటు పడుతున్నారు. దీంతో ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగం కన్నా, మెరుగైన ఉపాధి ఆదాయం లభిస్తుండటంతో ప్రభుత్వ ఉద్యోగాన్ని పక్కనపెట్టి స్వలాభంగా ఉండే పనులను కొందరు చక్కబెట్టుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏళ్ల తరబడి పాఠశాలలకు ఉపాధ్యాయులు దుమ్మా కొడుతుండడంతో విద్యార్థులపై పరోక్షంగా ప్రభావం చూపుతోంది అనేది జగమెరిగిన సత్యం. ఏది ఏమైనా ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నత అధికారుల అనుమతి లేకుండా విధులకు అనుపస్థితి కావడం ఉపాధ్యాయ వృత్తికి కళంకికం.

నోటీసులు జారీ చేశాం: మండల విద్యాశాఖ అధికారి

మండల పరిధిలోని జేత్యతండ ఎంపీపీఎస్లో పనిచేసే సత్యమూర్తి, బండరామారంలో పని చేసే వెంకట్ రాములు ఎలాంటి అనుమతి లేకుండా విధులకు రావడంలేదని నోటీసులు జారీ చేసినట్టు మండల విద్యాధికారి తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారికి కూడా తెలిపామన్నారు. త్వరలో శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రహారీ క్లబ్లు

- విద్యాసంస్థల్లో ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వుల జారీ
- ఉపాధ్యాయులు, పోలీసులు, తల్లిదండ్రులు, చురుకైన విద్యార్థులతో కమిటీ
- నిరంతర నిఘాకు తోడ్పాటు



నవతెలంగాణ-హుజూర్నగర్

రోజురోజుకు పాఠశాలలో మరియు కళాశాల పరిసర ప్రాంతాలలో పెరుగుతున్న గంజాయి ,ఇతర మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించేందుకు నివారిం చేందుకు ప్రభుత్వం తొలి ప్రయత్నం చేస్తోంది. గతంలో ఎన్ని ప్రయత్నాలు జరిగినా మాదకద్రవ్యాల వాడకం తగ్గలేదు. పూర్తిస్థాయిలో నియంత్రణ జరగలేదు. ఇటీవల ప్రభుత్వం ఒక కొత్త విధానములో ఆలోచించి ప్రభుత్వ విద్యాలయాల్లోనూ ప్రహరీ క్లబ్బుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ కమిటీలో ఉండే సభ్యుల్లో ఒకరు ఇద్దరు నిరంతరం పర్యవేక్షణలో ఉంటారు. పాఠశాలకు మరియు కళాశాలలకు వచ్చి పోయే వారిని గమనిస్తూ తమ నిఘా నేత్రాన్ని సంధిస్తారు. ఎవరైనా నూతన వ్యక్తులు పాఠశాల ఆవరణలోకి గాని కళాశాల ఆవరణలో గాని వచ్చినట్లయితే వారు ఎందుకు వచ్చారు, ఎలా వచ్చారు, ఏ పని మీద వచ్చారు, ఎవరిని కలిశారు. వంటి అంశాలను తెలుసుకుంటారు. వారి మీద అనుమానం వస్తే తామొక రిపోర్ట్ తయారు చేసి కమిటీకందిస్తారు. ఆ తర్వాత కమిటీ చూసుకుంటుంది. గత కొంతకాలంగా అనేక ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులు మాదకద్రవ్యాలు తీసుకుంటున్న సంఘటనలు ప్రభుత్వాన్ని కలవర పెట్టాయి. విద్యార్థులకు తెలిసి తెలియని వయసులో మత్తు మందులు వాడుతున్న సంఘటనల అక్కడక్కడ కొన్ని ఘటనలు జరిగాయి. వీటిని సమూలంగా నివారించాలని ఉద్దేశంతో నూతన వరవడికి ప్రభుత్వంశ్రీకారం చుట్టింది. ఈ తరుణంలోనే పాఠశాల విద్యా కమిషనర్ జీవో ఎంఎస్ నెంబర్ 20ని విడుదల చేస్తూ నూతన మార్గదర్శక సూత్రాలను వెలువరించారు. విద్యావ్యవస్థలో ప్రహరీ క్లబ్ ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రహరీ క్లబ్బులలో పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, కళాశాల స్థాయిలో ప్రిన్సిపాల్లు కమిటీ చైర్మెన్గా వ్యవహరిస్తారు. అదేవిధంగా ప్రతి తరగతిలో చురుకైన విద్యార్థులను మెంబర్లుగా నియమిస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులను కొంతమందిని పోలీస్ శాఖకు చెందిన ఒక వ్యక్తిని సభ్యుడుగా నియమిస్తారు. ఒక ఉపాధ్యాయుని కమిటీ మెంబర్ నియమిస్తారు. వీరు నిరంతరం పాఠశాలలు కళాశాల పరిసరాలను గమనిస్తూ ఉండాలి. ఎప్పటికప్పటికీ విషయాలను కమిటీ చైర్మెన్కు తెలియజేయవలసి ఉంటుంది. కమిటీ ఎప్పటికప్పుడు పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వవలసి ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో ఈ కమిటీలను ఏర్పాటు చేయవలసి ఉంటుంది. ఈ కమిటీ ద్వారానైనా విద్యార్థులు మత్తుకు బానిసలు కాకుండా ఉంటారని భావిస్తున్నారు. ఈ కమిటీల ఏర్పాటును పనితీరును ఆయా మండలాల్లో ఉన్న మండల విద్యాధికారులు జిల్లా విద్యాధికారులు పాఠశాలలకు మరియు కళాశాలలకు వెళ్ళినప్పుడు అవి ఏ విధంగా పనిచేస్తున్నాయో తెలుసుకొని పనితీరును మెరుగుపరు చుకోవటానికి తగిన సలహాలు ఇచ్చి కమిటీ సభ్యులను ప్రోత్సహించాల్సి ఉంటుంది. అప్పుడే మత్తుమందుల వాడకం పాఠశాలలో కళాశాల సరిహద్దుల్లోకి రాకుండా ఉంటాయి.

సాంబశివరావు వర్ధంతి

నవతెలంగాణ-తిరుమలగిరి



ఉద్యమాల ఉపాధ్యాయుడు, కుల-వర్గ సిద్ధాంతాల రూపకర్త దళిత బహుజన ఉద్యమ నాయకుడు కామ్రేడ్ ఊ.సాంబశివరావు నాలుగవ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం మండల కేంద్రం పూలే చౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న సాంబశివరావు చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు.కుల నిర్మూలన కోసం సామాజిక అసమానతలను రూపుమాపడం కోసం, అట్టడుగు వర్గాల ప్రజల కోసం, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల ప్రజల కోసం,సామాజిక న్యాయం కోసం, ముఖ్యంగా దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప నాయకుడని తెలిపారు. జీఎంపిఎస్ జిల్లా అధ్యక్షులు కడెం లింగయ్య మాట్లాడుతూ భారతదేశంలో వర్గ పోరాటంతో పాటు కులపోరాటం కూడా చేయాలని, అంతిమంగా అణగారిన కులాలు ఏకమై రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలని పోరాటం చేసిన గొప్ప నాయకుడు సాంబశివరావు అన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తగట్టు యాదగిరి, యాకయ్య, గిలకత్తుల రమేష్, యాదగిరి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలని వినతి

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



సూర్యాపేట జిల్లాలో సీజనల్ వ్యాధులను అరికట్టి, అంటువ్యాధులు సోకకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కోశాధికారి బండి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో వైద్యశాఖ సూపరింటెండెంట్ అంజయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి వర్షాల వలన గ్రామాలలో, పట్టణాలలో, విద్యాసంస్థలలో ప్రజలు, విద్యార్థులు టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ జ్వరాలు అంటూ వ్యాధులతో నాన అవస్థలు పడుతున్నారన్నారు. గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలోఆ సంఘం టౌన్ నాయకులు వీరబోయిన లింగయ్య, దండి ప్రవీణ్, భీమ్రెడ్డి, వినయ్, మహేష్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి గిరిజన సంఘం చైతన్య సదస్సులు

నవతెలంగాణ-హుజూర్నగర్టౌన్



ఈ నెల 30, 31తేదీల్లో మఠంపల్లిలో జరిగే సూర్యాపేట జిల్లా గిరిజన సంఘం చైతన్య సదస్సును జయప్రదం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు భూక్య పాండు నాయక్, జిల్లా అధ్యక్షులు మాలోతు బాలునాయక్ కోరారు. గురువారం స్థానికంగా వారు సదస్సు కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. అనేక పోరాటాల ఫలితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభ్యున్నతికి, చట్టసభలలో ఆమోదించిన చట్టాలను, ఉపకార పథకాలు, ప్రభుత్వ ఉత్తర్వులు అమలు జరిపించుకునే విధంగా తెలంగాణ గిరిజన సంఘం కృషి చేస్తుందన్నారు. అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో 11 లక్షల ఎకరాల పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని అన్ని గిరిజన సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ఉద్యమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లా సదస్సులో అనేక అంశాలను చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గి బ్రహ్మం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోసనబోయిన హుస్సేన్, తెలంగాణ గిరిజన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు బానోత్ వెంకటేశ్వర్లు, తేజవత్ వెంకన్న నాయక్, సక్కుబాయి, బానోత్ వెంకీ నాయక్, డి. అనిల్, చంద్రు నాయక్, బానోత్ సోనీ బాయ్, ధరావత్ భద్రమ్మ భాయ్, బానోత్ చిన్ని బాయ్, బానోత్ రమ్య బాయ్, బానోత్ రామారావు నాయక్, బానోత్ మంగితి భాయ్, భానోత్ గోపీచంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-మునగాల

మండల పరిధిలోని తాడువాయి సమీపంలో 65వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. ఏఎస్ఐ కల్లు శ్రీనివాస్రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల గ్రామానికి చెందిన పెరంబూరు రామకృష్ణ అలియాస్ రాంబాబు(58) బైక్పై తాడువాయి గ్రామం వెళ్ళాడు. తిరుగు ప్రయాణంలో రోడ్డు దాటుతూవుండగా విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న టిఎస్ 06ఇఆర్1414 నెంబర్ గల కారు వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబు తలకు కుడి కాలుకు బలమైన గాయాలైయ్యాయి. అపస్మారక స్థితిలోకి వెళ్ళిన ఆయనను చికిత్స నిమిత్తం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఏరియా హాస్పిటల్కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో కొద్ది సేపటి తరు వాత మరణించారు. మృతుడు రాంబాబు స్వగ్రామం తాడ్వాయి. ఆయన గత 35 సంవత్సరాల క్రితం మునగాల వచ్చి స్థిరపడి మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. సూర్యాపేట ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్యా లక్ష్మీ శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-గరిడేపల్లి



హుజూర్నగర్ నియోజకవర్గంలోని పలు పోలీసు స్టేషన్లలో సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ గురువారం ఆకస్మికంగా తనికీ చేశారు. దీనిలో భాగంగా గరిడేపల్లి పోలీసు స్టేషన్ను ఆయన సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, రికార్డులను ఆయా మండలాలకు సంబంధించిన సమస్యాత్మక గ్రామాలపై ఆయన ఆరా తీశారు. పోలీస్టేషన్ పరిధిలో ఎక్కువగా జరుగుతున్న సంఘటనలు వాటిపై నమోదయిన కేసులు, వాటినిన అదుపు చేసే విషయంలో తీసుకుంటున్న చర్యలపై సంబంధిత ఎస్ఐను వివరాలు అడిగి తెలసుకున్నారు. జిల్లాలో అతిపెద్ద రెండవ మండలమైన గరిడేపల్లిలో పోలీస్ సిబ్బంది తక్కువగా ఉన్నారని ఎస్పి దృష్టికి విలేకరులు తీసుకురాగా పరిశీలిస్తామని తెలిపారు. రాజకీయ చైతన్యవంతమైన గ్రామాలు చాలా ఉ ఉన్నాయని, ఇటీవల కొన్నిచోట్ల దొంగతనాలు ఎకుకవయ్యాయని విలేకరులు అడుగగా నేరాలు, దొంగతనాలు జరుగకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట కోదాడు. డిఎస్పి శ్రీధర్రెడ్డి, హుజుర్నగర్ సిఐ చలమందరాజు, గరిడేపల్లి ఎస్ఐ ఈట సైదులు, ఏఎస్ఐ రాములు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-హుజూర్నగర్టౌన్

గ్రామపంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా జరిగిన గ్రామపంచాయతీ కార్మికుల మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కోరారు. నెలసరి వేతనాలు అందక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు షేక్ అసన్ మియా, కార్మికులు కొప్పుల వీరారెడ్డి, చలి కంటి శ్రీను, పొదిల నాగరాజు, పారుపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిరాశపర్చిన రాష్ట్ర బడ్జెట్

- పీడీఎస్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



రాష్ట్ర విద్యారంగ అభివృద్ధి కోసం కేంద్రీకరిస్తామని మాటలు చెప్పిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేడు కేవలం 7.3 శాతం నిధులు మాత్రమే కేటాయించడం ఎంతవరకు సమంజసమని పీడీఎస్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామల ఆజాద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ విమర్శించారు. గురువారంస్థానిక సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అరవై ఫీట్ల రోడ్ లో రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడంను నిరసిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగం పైన కేంద్రీకరిస్తామని మాటలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆచారాణత్మక బడ్జెట్ కేటాయింపులు చేయకపోవడం శోచనీయమన్నారు. కేవలం 21389 కోట్లు కేటాయించి మాటల ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బడ్జెట్ ద్వారా తేలిపోయిందన్నారు. ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీల అమలు గురించి ఈ బడ్జెట్లో ప్రస్తావనే చేయకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే బడ్జెట్ ను సవరించి విద్యారంగానికి నిధులు పెంచడం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఉద్యమాలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్ రెడ్డి, తరుణ్, అరుణ్, ప్రసాద్, లక్ష్మణ్, ఆంజనేయులు, రాము తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి సీఐటీయూ శిక్షణా తరగతులు



జిల్లా అధ్యక్షులు దాసరి పాండు

నవతెలంగాణ- భువనగిరి అర్బన్

ఈ నెల 27, 28 తేదీలలో రామన్నపేటలో జరుగుతున్న సీఐటీయూ జిల్లా విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దాసరి పాండు అన్నారు. బుధవారం పట్టణంలోని సుందరయ్య భవన్లో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలని వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ, నాయకులు బట్టు కొండయ్య, యాదగిరి, వరమ్మ శాంతమ్మ, నిర్మల, పద్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిల్ కుమార్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-వలిగొండ రూరల్



మండలంలోని వేములకొండ రైతులు గురునాథ్ పల్లి కత్వా నుండి వేములకొండ చెరువు వరకు పేరుకుపోయిన గుర్రపుడెక్క ఆకు, కాల్వలో పేరుకుపోయిన పూడికను స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి రైతుల శ్రేయస్సుకోసం తన స్వంత నిధులతో తొలగింపు చేయడం పట్ల రైతులు కృతజ్ఞతగా గురువారం వేములకొండలోని అంబేద్కర్ చౌరాస్తా వద్ద ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సామ రాంరెడ్డి, ఎస్‌కె రసూల్, పులిపలుపుల రాములు, ఏర్పుల వెంకటేశం, కేశిరెడ్డి నీరజా వెంకటేశ్వర్ రెడ్డి, పొలగాని యాదయ్య, చెక్క సత్తయ్య, ఎనుగుల నర్సింహా, కాడిగళ్ల రవి, ఆకుల లలిత, కాడిగళ్ల సునీత, బుంగ మణెమ్మ, బత్తుల సువర్ణ పాల్గొన్నారు.

దళితులకు భూమి పాసుబుక్కులు ఇవ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్

గత 60, 65 ఏండ్లుగా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న హన్మాపురం గ్రామ దళితులందరికీ వెంటనే పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భువనగిరి మండల పరిధిలోని హన్మాపురం గ్రామంలోని దళితులు సాగు చేసుకుంటున్న సర్వే నెంబరు 87లోని 15 ఎకరాల 12 గుంటల భూమిని సింగిల్ విండో డైరెక్టర్ దయ్యాల నర్సింహ్మా, రైతులతో కలిసి పరిశీలన చేసి, అనంతరం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. హన్మాపురం గ్రామంలోని సర్వేనెంబర్ 87 లోని 15 ఎకరాల 12 గంటల భూమిని 14 ఎస్సీ కుటుంబాలకు చెందిన 29 మంది సేద్యం చేసుకుంటున్నారని వారందరికీ ప్రభుత్వము వెంటనే నూతన పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలని, ఆనాడు ఎన్నో కష్టనష్టాలకు ఓడ్చి పైసా పైసా కూడా పెట్టి భావి తొవ్వి , కరెంటు సాంక్షన్ ను తెచ్చుకొని మోటార్ తో నీటిని తోడి ఆ నీళ్లతో వ్యవసాయ పంటను పండించి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. ఆ భూములకు పట్టాదారు పాసుబుక్కులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి



లబ్ది పొందలేదని, బ్యాంకుల నుండి కూడా ఎలాంటి సహాయము తీసుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సేద్యం చేసుకుంటున్నా భూమికి పట్టాదారు పాస్బుక్ ఇవ్వాలని పలుమార్లు జిల్లా కలెక్టర్, ఆర్డీఓకు, స్థానిక తహసిల్దారుకు, ప్రజా ప్రతినిధులకు మెమోరండం ఇచ్చి మొరపెట్టుకున్నా ఇప్పటివరకు నూతన పాస్ బుక్స్ లు ఇవ్వలేదని అన్నారు. ఈ మధ్యకాలంలో ఆ భూమిని భూమి కాజేయడానికి, ఆక్రమించడానికి పక్కనున్న కొంతమంది భూసాములు ప్రయత్నం చేస్తున్నారని ఇప్పటికైనా ప్రభుత్వము తక్షణం స్పందించి భూమిని సర్వే చేసి హద్దురాళ్ళు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. సింగిల్ విండో డైరెక్టర్ దయ్యాల నర్సింహ మాట్లాడుతు రెక్కాడితే గాని డొక్కానిండని దళితులు భూమిని సాగు చేసుకుని బతుకుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగుదారులైన దళితులందరికీ పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలని లేనిచో పోరాటాన్ని కొనసాగిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం నూతన పాసుబుక్కుల సాధన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా బిచ్చాల మహేందర్, ప్రధాన కార్యదర్శిగా మూడుగుల రాజు, గౌరవ అధ్యక్షులుగా మూడుగుల అంజయ్య, ఉపాధ్యక్షులుగా బండారి రామచందర్, సహాయ కార్యదర్శిగా చందుపట్ల మల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా బిచ్చాల మైసయ్య, మూడ్గుల వెంకటయ్య, మూడ్గుల బాల్ నరసింహ, బండారి జీవన్ రావ్, బిచ్చాల పరుశరాములు, పొట్ట జగన్ ఎన్నుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ముడుగుల బాలరాజు, బాల్ నరసింహ, మైసయ్య, కొండలు ప్రభాకర్, ఉప్పలయ్య, మహేష్, వెంకన్న, బిక్షపతి, రమేష్, నరసయ్య, మైసయ్య, కొండలు, రాజు, ఉప్పలయ్య, సుధాకర్, నరసింహ, పెంటయ్య, బిక్షపతి, లక్ష్మి, పరమేష్, కొండల్ ,సీతారాములు, మైసయ్య, జయమ్మ, లింగయ్య అంజయ్యలు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా కలెక్టర్ హనుమంత్ కే జెండగే

నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం



వసతి గృహాల విద్యార్థుల చదువు, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే జెండాగే అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని సర్వేల్ గ్రామంలోని గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు, సిబ్బందికి సంబంధించిన హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌లోని సరుకులను పరిశీలించారు. తరగతి గదులను చూశారు. 8, 9వ తరగతుల విద్యార్థులతో పాఠాలను చదివించారు. వెనుకబాటు ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక తరగతులు తీసుకోవాలని, ఇంగ్లీష్ మీడియంపై శ్రద్ధ తీసుకోవాలని అధ్యాపకులకు సూచించారు. నూతనంగా నిర్మించిన భవనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం సర్వేల్ జిల్లా పరిషత్ హైస్కూల్ సందర్శించి పిల్లలతో పాఠాలు చదివించారు. ప్రత్యేక బోధనా తరగతులు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన తాగునీరు, టాయిలెట్ పనులను చూశారు. పనులకు సంబంధించిన పేమెంట్ పనులు త్వరగా చేయాలని సూచించారు. తదుపరి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణీ స్త్రీ సేవలపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పౌష్టికాహారం పట్ల వారికి తగిన సూచనలు ఇవ్వాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే 3-5 ఐదు సంవత్సరాల పిల్లలకు నూతన జాతీయ విద్యా విధానం అనుసరించి కేంద్రాలలో ఆటపాటల ద్వారా విద్య అందించాలని,పిల్లల ఆరోగ్యమైన ఎదుగుదలకు ప్రతినెలా ఎత్తు, బరువులను పర్యవేక్షిస్తూ సరైన ఆహారం అందించడంలో తల్లులకు తగు సూచనలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ప్రమోద్ కుమార్, సర్వేర్ గురుకులం ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) పోరుబాట

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

మండలంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోరుబాట కార్యక్రమం గురువారం మందోళ్లగూడెం గ్రామపంచాయతీలో తూర్పుగూడెం సింగరాయచెరువు సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పర్యటించారు. ఈ సందర్భంగా బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో కుక్కలు కోతుల సమస్య విపరీతంగా ఉందన్నారు. ఈ విధంగానే గ్రామాలలో సీసీ రోడ్లు డ్రైనేజీ సమస్య చాలా విపరీతంగా ఉన్నాయని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మందల్లగూడం గ్రామపంచాయతీ నుండి ఆయా గ్రామాలకు సీసీరోడ్లు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చిన్న కొండూరు మాజీ ఎంపీటీసీ చిన్నబోయిన వెంకటేశం సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు శ్రీశైలం, శేఖర్, అంజయ్య, సాలయ్య వెంకటేశం, లింగస్వామి, బుచ్చిరెడ్డి, పరమేష్, భాస్కర్, శ్రీనివాస్, రాజమల్లయ్య, వెంకటరెడ్డి, ఉస్మాన్, కృష్ణారెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలి

నవతెలంగాణ-ఆత్మకూరు ఎం

ఆడపిల్లలు చదువుతో పాటు అన్నిరంగాల్లో ముందుండాలని బాలికల శిశు అభివృద్ధి జిల్లా అధికారి రాధ అన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా, శిశ, వికలాంగుల వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికలపాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమములో జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ హర్ష, భార్గవి, మనీషా, ప్రత్యేక అధికారిణి పద్మ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కొర్రటికల్ ప్రభుత్వపాఠశాలలో శిక్షా సప్తాహ

నవతెలంగాణ-ఆత్మకూరు ఎం

మండలంలోని కొరటికల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా 4వ రోజు జాతీయ సమైక్యత అంశంపై దేశంలో జరిగే వివిధ పండగలు, జాతీయ దినోత్సవముల ప్రత్యేకను తెలుసుకొనుటకు విద్యార్థులకు గురువారం శిక్షా సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బోనాలు, మొహరం పండుగల వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు వెంకన్న ఉపాధ్యాయులు స్వామి, రవి, వరప్రసాద్, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని మల్లగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తాళ్లపల్లి సుధాకర్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించడం జరిగింది. వారి కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేశ్ ఆధ్వర్యంలో గురువారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారికి మనోధైర్యం ఇస్తూ వారి తల్లి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చామకూర గోపాల్ గౌడ్, సందిల భాస్కర్ గౌడ్, ఎర్ర గోకుల జశ్వంత్, రెడ్డబోయిన రాజు, గొడుగురాజు, మల్యాల రవి తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు కూలిన కూరగాయల పందిరి సేద్యం



నవతెలంగాణ-ఆలేరు టౌన్

ఆలేరు పట్టణంలోని కాటమయ్య నగర్‌లో కూరగాయలు సాగు చేస్తున్న దేవి యాదగిరి చెందిన దొండ సాగు, కూరగాయల పందిరి సేద్యం. ఇటీవల కురిసిన వర్షాలకు ఎదురుగాళ్లకు నేలమట్టం అయిందని రైతు యాదగిరి గురువారం తెలిపారు. రోజువారీగా తనకు దాదాపు 500, నుండి వెయ్యి రూపాయల వరకు ఆదాయం వచ్చేదని వాపోయారు. ప్రభుత్వం నుండి తగిన విధంగా ఆర్థిక సహాయం అందజేయాలని, ప్రభుత్వాన్ని, వ్యవసాయశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

27 నుంచి జిల్లా విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

రామన్నపేటలో ఈ నెల 27, 28 తేదీలలో ఎంఎల్ఎస్ఎస్ ఫంక్షన్ హాలులోజరిగే విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరుతూ ఆలేరు మండలం గొలనుకొండ గ్రామంలో గురువారం సీఐటీయూ మండల కన్వీనర్ సంగీరాజు ఆధ్వర్యంలో కార్మికులకుతో కలిసి కరపత్రం విడుదల చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మద్దేబోయిన ఉప్పలయ్య, ఆంజనేయులు, స్వామి, కిష్టయ్య, నర్సింహులు, వెంకటయ్యలు పాల్గొన్నారు.

నేడు సుదగాని ఎట్టయ్య 16వ వర్థంతి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

నిబద్ధతకు నిలువుటద్దం, ప్రజా సమస్యల పరిష్కారం కొరకు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే తనదైన శైలిలో ఉద్యమించిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సుదగాని ఎట్టయ్య. ఆలేరు ఎంపీపీగా, పార్టీ నిర్మాణానికి పెద్దదిక్కుగా ప్రజలకు సేవలు అందించారు. ఎట్టయ్య 16వ వర్థంతి ఆలేరు మండలంలోని శర్బనపురం గ్రామంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి, దూపటి వెంకటేష్, మండల సీనియర్ నాయకులు సుదగాని ఎట్టయ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ హాజరై వర్థంతి సభలో ప్రసంగించనున్నారు. ఎట్టయ్య 16వ వర్థంతి సభకి భారీగా తరలిరావాలని మండల కమిటీ సభ్యులు సుధా గాని సత్యరాజయ్య తెలియజేశారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో టీడబ్ల్యూజేఎఫ్ ముందంజ

నవతెలంగాణ-భువనగిరి అర్బన్



జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య టీడబ్ల్యూజేఎఫ్ ముందంజలో ఉందని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొలుపుల వివేకానంద అన్నారు. గురువారం భువనగిరి పట్టణంలోని సుందరయ్య భవన్ వద్ద యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పోరాటాలా వారధి ఫెడరేషన్‌లో ప్రతీ జర్నలిస్ట్ చేరాలని సూచించారు. తక్షణమే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇంటి స్థలం ఉన్న వారికీ ప్రభుత్వం ఇస్తామన్న ఐదులక్షల ఆర్థిక సహాయం పథకాన్ని జర్నలిస్టులకు వర్తింప జేసీ ఇండ్ల నిర్మాణానికి సహకరించకరించాలని కోరారు. రాష్ట్ర వ్యాపితంగా గురుకులాల్లో జర్నలిస్టుల పిల్లలకు ప్రత్యేక కోటా ద్వారా సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెరబోయిన నర్సింహులు ముత్యాల జలంధర్ సీనియర్ నాయకులు మట్టయ్య ఎస్ కే ఉస్మాన్ షరీఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పాక జహంగీర్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దిగోజు నాగ చారీ, జిల్లా కమిటీ సభ్యులు ఎలుగల కుమారస్వామి, ఆరే నర్సింహులు, పోలేపాక మత్స్యగిరి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

బ్రిడ్జి రోడ్డు మరమ్మతులు నిర్వహించాలి



నవతెలంగాణ-భువనగిరిఅర్బన్

సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ

జగదేవ్‌పూర్ భువనగిరి మధ్యలో ఆర్టీఓ ఆఫీస్ దగ్గర ఉన్న రైల్వే బ్రిడ్జి పైన రోడ్డును మరమ్మతులు చేపట్టాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. బుధవారం సీపీఐ(ఎం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బ్రిడ్జి పైన నిరసన చేపట్టారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే బ్రిడ్జి పైన గుంతలు ఏర్పడి, రోడ్డుపైన ఇనుప రాడ్లు తేలి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. నాసిరకంగా బ్రిడ్జి పైన రోడ్ల నిర్మాణం చేశారని అన్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల మరమ్మత్తు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీపీఐ(ఎం) నాయకులు బందెల ఎల్లయ్య, వల్దాస్ అంజయ్య, వనం రాజు, శివ, రాహుల్, రాంబాబు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్



గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం చౌటుప్పల్ మండల ఎంపీవోకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు, ఆదిమూలం నందీశ్వర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మిక వేతనాలు సమయానికి ఇవ్వకపోవడం వలన, ఆర్థిక ఇబ్బందులు పడుతూ అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది కావున అతి తొందరగా పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఆదిమూలం నందీశ్వర్ అన్నారు. ప్రతి నెల పారిశుద్ధ మెటీరియల్ ఇవ్వాలని, కొన్ని గ్రామపంచాయతీలో ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. కావున ఆ మెటీరియల్ కూడా ప్రతి నెల ఇవ్వాల్సిందిగా కోరడమైనది మరియు గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని జీవో నెంబర్ 51 సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని వివిధ డిమాండ్స్ తోనివినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమానికి గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు మాంద్ర శీను, ఎలివేటి నరసింహ,రామచంద్రం,ఉట్కూరి రమేష్,భాగ్యమ్మ,పప్పు లింగస్వామి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

'బట్టివన్నీ.. వట్టి మాటలే'

నవతెలంగాణ-రాజాపేట

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బట్టి ప్రవేశపెట్టిన ప్రజలకు ఆశాజనకంగా లేదని బట్టి వన్నీ వట్టి మాటలేనని గ్రామీణ పట్టణ ప్రాంతాల అన్ని వర్గాల ప్రజల ఆశలపై నీళ్లు చల్లే విధంగా డొల్ల బడ్జెట్ ఉందని తెలంగాణ రాష్ట్ర రజక సంఘం ప్రధాన కార్యదర్శి, రాజపేట మండల బీఆర్ఎస్ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ ఎద్దేవా చేశారు. గురువారం అసెంబ్లీలో మంత్రి బట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాసంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టే పరిస్థితి లేదని స్పష్టమైందన్నారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండలం బీఆర్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఐటీయూ శిక్షణాతరగతుల వాల్‌పోస్టర్ విడుదల



నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

మండలంలోని ఎల్లంబావి గ్రామంలో సీఐటీయూ రాజకీయ శిక్షణా తరగతుల వాల్ పోస్టర్లను గురువారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి పాషా విడుదల చేసి మాట్లాడారు. ఈ రెండు రోజుల క్లాసులలో కార్మికులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న అటువంటి కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించినట్టు తెలిపారు. ట్రాన్స్పోర్ట్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు కొంతం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. జిల్లాలోని రాసిపాడు కార్మికులు అంగన్వాడీలు స్కూల్స్ స్వీపర్లు మరియు గ్రామపంచాయతీ కార్మికులు మున్సిపల్ కార్మికులు భవనిర్మాణ కార్మికులు అనుకున్న ప్రకారంగా ఈనెల 27న జెండా ఆవిష్కరణ విజయవంతం చేయాలని కార్మిక వర్గాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భవనాలు కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు జిల్లా కమిటీ సభ్యులు బొడ్డు పరమేష్.బీ రోజా, వంగూరు శీను,రాజు,వెంకటేశం,బాలయ్య, నరేష్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

- టీయూఎఫ్ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్‌కె చాంద్

నవతెలంగాణ-రామన్నపేట

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటన చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ కె చాందు కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేకమంది త్యాగాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తే గత ప్రభుత్వం ఉద్యమకారుల ఊసే ఎత్తలేదని, మోసం చేసిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తిస్తామని చెప్పి ఆరు గ్యారెంటీలలో చెప్పినట్లుగానే వెంటనే గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలని, గుర్తింపు కార్డులు, 250 గజాల ఇంటి స్థలం, 25 వేల రూపాయల పెన్షన్ మిగతా ప్రోత్సాహకాలు, రాయితులు జార?ండ్ రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లుగానే అమలు చేయాలని ఆయన అన్నారు. ఆయన వెంట ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు నోముల శంకర్, బొడ్డుపల్లి లింగయ్య, రాములు ఎండి ఇమామ్ పాల్గొన్నారు.

రైతును రాజును చేయడమే బడ్జెట్ లక్ష్యం



నవతెలంగాణ-యాదగిరిగుట్ట

రైతును రాజును చేయడమే బడ్జెట్ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడూతు వ్యవసాయ రంగానికి రూ. 71 వేల కోట్లు కేటాయించామని, రైతు రుణమాఫీకి మా ప్రభుత్వం 31 వేల కోట్లు కేటాయించిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో గొర్రెల స్కాం జరిగింది. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 30 వేల ఉద్యోగాలు ఇస్తే ఓర్వ లేకపోతున్నారు. కేసీఆర్ చిల్లర మల్లర వ్యాఖ్యానాలు ఆపాలన్నారు. రైతుల ప్రయోజనాల కోసం బడ్జెట్‌లో ఏకంగా రూ.71 వేల కోట్లుకేటాయించామన్నారు. ఆర్టీసీ బస్సులో మహిళలు ఎలా ఉచితంగా ప్రయాణిస్తున్నారో కేసీఆర్‌కు తెలియదా అని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ ఊసే లేకపోతే కేసీఆర్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.? బీజేపీతో కేసీఆర్ లాలూచీ తనం మరో సారి బయటపడిందన్నారు. రేవంత్‌రెడ్డి దెబ్బకు కేసీఆర్ మీడియా పాయింట్‌కు రావాల్సి వచ్చిందన్నారు. మీడియా పాయింట్‌కు వచ్చి మాట్లాడాల్సిన పరిస్థితి వస్తుందని కేసీఆర్ కలలో కూడా ఊహించి ఉండడని. కేసీఆర్ తన వైఖరి మార్చుకోకపోతే ఈ సారి మీడియా పాయింట్‌కు కూడా కేసీఆర్ రాకుండా ప్రజలు చుస్తారన్నారు.

మద్యం మత్తులో యువత చిత్తు

- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- మద్యానికి బానిసలవుతున్న యువత
- చిన్నాభిన్నం అవుతున్న కుటుంబాలు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

మద్యం మత్తులో యువత చిత్తయిపోతోంది. ఎక్కడ పడితే, అక్కడ బెల్టు షాపులు ఉండడంతో పాటూ మారుమూల గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. గ్రామాలలో దాబాహోటల్, హోటల్, కిరాణా షాపులు ఎక్కడపడితే అక్కడ మద్యం దొరుకుతుండడంతో, చదువుకునే యువకులు, ట్రాక్టర్లపై పనిచేస్తున్న యువత, కూలినాలి పనులు చేసి యువత మద్యానికి బానిసవుతున్నారు. ఆలేరు ఎక్సైజ్ పరిధిలో మొత్తం 22 మద్యం షాపులు ఉన్నాయి. ఆలేరు, రాజపేట, మోటకొండూరు, తుర్కపల్లి, యాదగిరిగుట్ట మండలాల పరిధిలో మద్యం షాపులు ఉన్నాయి. పెద్దవాళ్ల నుంచి మొదలుకొని, మహిళలు, యువత వరకు మద్యంలో మునిగి తేలుతున్నారు. పొద్దంతా చేసిన కష్టాన్ని మర్చిపోయేందుకు, సాయంత్రాన్ని మద్యం దుకాణాలలో వచ్చిన రూపాయలను వేచ్చిస్తున్నారు. దీంతో చాలా కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ఆలేరు మండలంలో ఎక్కువ శాతం యువత రోజువారీ కూలీలుగా ఉన్నారు. రోజంతా కష్టించి పని చేసిన సొమ్ములో అధిక భాగం మద్యానికే ఖర్చుచేస్తున్నట్టుగా సమాచారం.



పచ్చని కుటుంబాల్లో చిచ్చుపెడుతున్న మత్తు..

మద్యానికి బానిసలై కుటుంబాలను పట్టించుకోకపోవడంతో.. తాగుబోతు మొగుడు వద్దంటూ భార్యలు పంచాయితీ పెట్టిస్తున్న పరిస్థితి గ్రామాలలో సర్వసాధారణమై పోయింది. పోలీస్ స్టేషన్ల వరకు పంచాయతీలు వచ్చిన పరిస్థితిలు ఉన్నాయి. యువత మద్యం తాగిన మత్తులో గ్రామాలలో చిన్న, చిన్న విషయాలకే పెద్ద, పెద్ద గొడవలు పెట్టుకున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మరి కొందరు మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాల గురైన సంఘటనలు ఉన్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా నడుస్తున్న సందర్భంలో నిత్యం మద్యానికి బానిసైన వారు ఉన్నారు. రియల్ ఎస్టేట్ దందా నడవకపోవడంతో అప్పులు చేసి మద్యం సేవిస్తున్న వారు ఉన్నారు. రెండు నెలల క్రితం ఆలేరు సాయిగూడెం మధిర గ్రామం రామసముద్రానికి చెందిన మద్యం ప్రియుడు, కయా కష్టం చేసి వచ్చి అలసట చెంది, మద్యం లిక్కర్ సేవిస్తుండగా, గ్లాస్‌లో పోసుకున్న మద్యం తాగుతున్న క్రమంలోనే మంట రేగడంతో, తండ్రి ఉమ్మేయగా, తనయుడు అలాగే త్రాగడముతో స్పిరిట్ ఆల్కహాల్ కారణంగా గొంతు మండడంతో చికిత్స పొందుతూ మరణించిన సంఘటన సైతం ప్రజల కళ్ళ ముందు తేలియాడుతోంది. ఇంటిపెద్ద చనిపోవడంతో వీధినపడ్డ కుటుంబాలెన్నో కనిపిస్తూనే ఉన్నాయి. కల్తీ మద్యం కుటుంబాలలో విషాదాన్ని నింపుతోంది. ఒకవైపు మద్యం షాపుల వారికి నెలలో ఇంత మద్యం అమ్మాలని చెప్పే ఎక్సైజ్ అధికారులు, నాణ్యత ప్రమాణాల గురించి దృష్టి సారించిన దాఖలాలు కనిపించడం లేదనే చెప్పవచ్చు. ఆలేర్ ఎక్సైజ్ పరిధిలో, ఎక్సైజ్ ఉన్నతాధికారుల (ప్రత్యేక బృందం) తనిఖీలలో మద్యం సక్రమంగా లేకపోవడంతో గతంలో వైన్ షాపులు సీజైన సంఘటనలు ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక, గ్రామాలలో, పట్టణాలలో బెల్ట్ షాపులను నిషేధిస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ గ్రామాలలో బెల్టు షాపుల వద్ద, మద్యం అమ్మకాలు యథావిధిగా కొనసాగుతున్నాయని, గతంలో మద్య నిషేధం కొరకు పనిచేసిన కొందరు చెబుతున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ పోలీసు యంత్రాంగం బెల్టు షాపుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
శుక్రవారం | జులై 26, 2024 | www.navatelangana.com

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-రాజాపేట

మండలంలోని పారుపల్లి గ్రామంలో తాళ్లపల్లిలాజర్, తాటి కాయల కొమరయ్యలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. వారి కుటుంబాలకు జై భీమ్ యూత్ అసోసియేషన్ వారు ఇరువురి కుటుంబాలకు రూ.5వేలను జై భీమ్ యువగళం అసోసియేషన్ వారు ఆర్థిక సహాయంగా ఒక్కొక్కరికి 2500 రూపాయలు గురువారం వేర్వేరుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోత్కుపల్లి జ్యోతి ప్రవీణ్, మోత్కుపల్లి నవీన్, భూపతి బాలరాజ్, భూపతి బాబురావు,భూపతి రామచందర్, వెంకటేష్, మధు భానుచందర్, వెంకటేష్, సుధాకర్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం



నవతెలంగాణ -పెద్దవూర

మండలం లోని పర్వేదుల గ్రామ పంచాయతీ కార్యదర్శి మహ్మద్ సాధిక్ బదిలీ పై పెద్దవూర మండలం పినవూరకు బదిలీ పై వెళు తన్నారు. గురువారం స్థానిక గ్రామ సచివాలయం లో స్థానిక అంగన్వాడీ సూపర్ వైజర్, వెంకాయమ్మ, ఏఈఓ రామ్, అంగన్వాడీ టీచర్లు, గోపాల మిత్ర మధు శాలువా తో ఘన సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు భాగ్యమ్మ , జ్యోతి, అనూష, ఆశావర్కర్ల పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు

- పట్టించుకోని ట్రాన్స్ కో అధికారులు
- బయాందోళనలో రైతులు

నవతెలంగాణ -పెద్దవూర

అసలే వర్షాకాలం నాలుగైదు రోజులుగా వర్షం కురుస్తుంది. గాలికి ఒరిగిన విద్యుత్ స్తంభాలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఎప్పుడు ఏ స్తంభం పడి ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఏఎంఆర్పీ డిస్ట్రిబ్యూటరీ కాలువ పక్కన, కొతగూడెం వెళ్లే మట్టిరోడ్డు పక్కన వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేసిన కరెంటు స్తంభాలు ఒకటి కాదు, రెండుకాదు ఏకంగా 5 విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి కూలిపోవ టానికి సిద్ధంగా ఉన్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వ్యవసాయ పనుల్లో కూలీలు పనులు చేస్తుంటారు. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవటంతో తీగలు చేతికి అందేలా వేలాడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాలు వ్యవసాయ ఆధారి తం కావటంతో తరుచుగా ట్రాక్టర్లతో గడ్డిని ఈ రహదారుల గుండా రవాణా చేస్తుంటారు. దీంతో విద్యుత్ వైర్లు గడ్డి ట్రాక్టర్‌లకు తగిలి ప్రమాదాలు చోటుచేసుకుంటాయని ఆందోళన చెందుతున్నారు. గతంలో నాయినవాని కుంట సమీపంలో ప్రమాదం జరిగింది. ప్రాణనష్టం జరగకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి సంఘటనలు మండలంలో అనేకం చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఒరిగిన కరెంటు స్తంభాలను మంచిగా వేయాలి

కత్తి వెంకట్ రెడ్డి..రైతు, కొత్త గూడెం

మాకు అక్కడ మూడేకరాలలో పత్తి సాగు చేశాను. మా పంట పొలం లో రెండు కరెంటు స్తంభాలు ఒరిగి పోయాయి. కరెంటు తీగలు కిందికి వేలాడు తున్నాయి. నిత్యం వ్యవసాయ పనులు చేస్తుంటాం. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో నని భయందోళన చెందుతున్నాం. ట్రాన్స్ కో అధికారులు విద్యత్ స్తంభాలు బాగుచేయాలి. లేకుంటే ప్రమాదం జరిగే అవకాశం వుంది.

రైతులు మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు

ట్రాన్స్ కో ఏఈ దాసయ్య, పెద్దవూర

ఏఎంఆర్పీ కాలువ నాయిన తుంగతుర్తి స్టేజి పక్కన ,కొత్తగూడెం రైతుల పంట పొలాల్లో కరెంటు స్తంభాలు ఒరిగినట్లు మాకు ఎలాంటి సమాచారం రాలేదు. వెంటనే ట్రాన్స్ కో అధికారులం పరిశీలించి ఒరిగిన కరెంటు స్థంబాలను తొలగించి మంచిగా ఏర్పాటు చేస్తాం. రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దు.

సరిహద్దు చెక్ పోస్టును తనిఖీ చేసిన ఎస్పీ



నవతెలంగాణ-మఠంపల్లి

మండలంలోని మట్టపల్లి వద్ద రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే వంతెన పై వున్న సరిహద్దు చెక్ పోస్టును గురువారం ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రాకపోకల రిజిస్టర్ పరిశీలించి మాట్లాడుతూ చెక్ పోస్ట్ వద్ద పటిష్ట భద్రత ఉంటుందని,ఎటువంటి అక్రమ రవాణా కాకుండా నిత్యం నిఘా ఉంటుందని తెలిపారు. అనంతరం మఠంపల్లి పోలీస్ స్టేషన్లో రికార్డులు పరిశీలించారు. మండలంలో కేసులోకి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసులు విషయమై సీఐ, ఎస్ఐలు మండలంలోని 540 సర్వే నెంబర్లో ప్రభుత్వ భూమికి సంబంధించిన వివాదాల ఎక్కువగా ఉంటాయని ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, సీఐ చరమందరాజు, మఠంపల్లి, హుజూర్‌నగర్ ఎస్సైలు రామాంజనేయులు, ముత్తయ్యలు ఉన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పట్టని ప్రభుత్వం



నవతెలంగాణ -పెద్దవూర

హాస్టల్ విద్యార్థుల సమస్యలను పట్టించుకో కుండా ప్రభుత్వం గాలికి వదలి వేసిందని కేవీపీఎస్ జిల్లా నాయకులు దొంతాల నాగార్జున అన్నారు.గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై నెలన్నర రోజులు అవుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు దుప్పట్లు ఇవ్వలేదని అన్నారు. నేటి ధరల పెరుగుదల కనుగుణంగా కాస్మోటిక్ చార్జింగ్ 2500 రూపాయలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వార్డెన్ స్థానికంగా ఉండకపోవడం వల్ల విద్యార్థులను పట్టించుకునే నాధుడు లేరని అన్నారు.రాత్రిపూట కరెంటు పోతే అంధకారంలో ఉండాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు దోరేపల్లి మల్లయ్య పాల్గొన్నారు .

ఆర్థిక సాయం



నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని సిరిపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మిర్యాల రామకృష్ణ కుటుంబ సభ్యులను పీఏసీఎస్ వైస్ చైర్మెన్ అంబటి ఉపేంద్ర రవీందర్‌రెడ్డి పరామర్శించి, 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మీనర్స్, మాజీ యం.పి.టి.సి లు పున్న వెంకటేశం, బడుగు రమేష్, నాయకులు గోశిక చక్రపాణి, బండ శ్రీనివాస్ రెడ్డి, కూనూరు ముత్తయ్య పున్న వెంకటేశం, మాజీ ఉపసర్పంచ్ ఏళ్ల మధుసుధన్ రెడ్డి, సాయని శేఖర్, పగుడాల శివ గణేశ్, రాపోలు రమేష్, జెల్ల లక్ష్మీనారాయణ, తాటి భిక్షపతి, రాపోలు స్వామి, రాపోలు చెన్నయ్య, పున్న వేణు, మూడుదుడ్ల రమేష్, కొంగరి సాంబయ్య, పున్న భద్రాచలం, పున్న శ్రీనివాస్, దోర్నాల శ్రీరాములు, కూనూరు రమేష్, పగుడాల పరందాములు, కట్ట రాంరెడ్డి, ఏలే కృష్ణ, పున్న కనకరత్నం, రాపోలు అమరేందర్, రాపోలు రాజశేఖర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లు లేక అవస్థలు



నవతెలంగాణ-మోత్కూర్

ప్రభుత్వాలు మారినా తమ ఎస్సీ కాలనీలో వీధుల పరిస్థితి ఇంతేనని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని గాంధీనగర్, ఎస్సి, కాలనీలోని పలు వీధుల్లో సీసీ రోడ్లు లేక నరకయాతన పడుతున్నామని, చిన్న చినుకు వచ్చిన వీధులు బురదమయంగా మారి నడవడానికి ఇబ్బందులు పడుతున్నామని, వృద్ధులు వికలాంగులు ప్రమాదాలకు గురవుతున్నారని, అధికారులు పన్నులు కట్టించుకుంటున్నారే కానీ మా సమస్యలు మాత్రం పట్టించుకోవటం లేదని, రాత్రి వేళల్లో పాములు తేళ్లు తిరుగుతున్నాయని బయటకు వెళ్లాలంటేనే భయభ్రాంతులకు గురి కావాల్సి వస్తుందని, ఎన్నికల సమయంలో నాయకులు మా ఓట్లు అడగడానికి వస్తారే తప్ప తాము పడుతునా.. ఇబ్బందులను పట్టించుకోవటం లేదని, ఇకనైనా అధికారులు స్థానిక నాయకులు వెంటనే మా సమస్యలను గుర్తించి ఆ కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నాం

మున్సిపల్ కమిషనర్ బి. శ్రీకాంత్

కాలనీలో సీసీ రోడ్లు నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రత్యేక చొరవతో కాలనీలో సిసి రోడ్లకు నిధులు మంజూరు చేశారని, త్వరలోనే టెండర్లు పిలిచి సీసి రోడ్లు నిర్మిస్తాం. కాలనీవాసుల ఇబ్బందులను తొలగిస్తామని తెలిపారు.

ప్రభుత్వ నిరంకుశ వైఖరి విడనాడాలి



నవతెలంగాణ- చండూరు

బీజేవైఎం కార్యకర్తలపై, నిరుద్యోగులపై కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరి విడనాడాలని బీజేపీ యువమోర్చా రాష్ట్ర నాయకులు పిన్నింటి నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం చండూర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు నిరుద్యోగ యువత న్యాయమైన డిమాండ్లను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ యువ మోర్చా మండల అధ్యక్షులు ఆస్కాని శ్రీను , పేసర్ల హరీష్ ,నకిరేకంటి రఘు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం నిల్వపై అవగాహనా కార్యక్రమం

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

వరి ధాన్యం నిల్వ అవగాహనపై రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీ, ఏరువాక కేంద్రం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు జాగ్రత్తలు డబ్ల్యూ డిఆర్ఏపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం మండలంలోని ముత్తిరెడ్డిగూడెం రైతు వేదికలో వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయు గిడ్డంగులు, నిల్వధాన్యంపై రుణాలు' అనే అంశంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐపిహెచ్ఎం సహాయ సంచాలకులు డా. జ్యోతి మాట్లాడుతూ ధాన్యం నిల్వ సమయంలో ఆశించే చీడ పీడలు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. డబ్ల్యూ ఆర్‌డిఏ, వ్యవసాయ ఋణాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఏరువాక ప్రధాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి అనిల్ కుమార్ మాట్లాడుతూ వరి, ప్రత్తి పంటలలో చీడపీడల గురించి వివరించారు. ప్రస్తుత పంటలలో చీడ, పీడల నివారణ గూర్చి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. శిక్షణా కార్యక్రమం అనంతరం భువనగిరిలోని గిడ్డంగులను సందర్శించి, రైతుల సందేహాలకు సమాధానాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, కె మమత, ఎన్.ఐ.పి హెచ్ఎం పి జ్యోతి, మండల వ్యవసాయాధికారి ఎస్ పావని, వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేష్, ఎం వేణు, యంగ్ ప్రొఫెషనల్ గ్రామ అభ్యుదయ రైతులు రాంపల్లి కృష్ణ, కంచి మల్లయ్య, మందాడి సిద్ధారెడ్డి, జనార్ధన్, పురుషోత్తం రెడ్డి, దుర్గపతి చంద్రమ్మ లు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలోని సమస్యలను పరిష్కరించాలి



- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి

నవతెలంగాణ-మోత్కూర్

మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) పోరుబాటలో భాగంగా మోత్కూర్ మున్సిపాల్టీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీసు ముందు ధర్నా నిర్వహించి, మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బొల్లు యాదగిరి, మాట్లాడుతూ.. మున్సిపల్ కేంద్రంలో రోడ్డు వెడల్పు పనులు, దాదాపు సంవత్సరం దాటినా నత్త నడకన సాగుతుండటంతో రవాణా, మరియు వాహనదారులు ఇబ్బందులు పడడమే కాక, రోడ్డు ప్రమాదాలు కూడ జరుగు తున్నాయని, యుద్ధ ప్రతిపాదికన రోడ్డు పనులు తక్షణమే పూర్తి చెయ్యాలని కోరారు. సుందరయ్య కాలనిలో సీసీ రోడ్డులు, మురికి కాల్వలు, నిర్మించాలని వీధీ లైట్లు వెంటనే వెయ్యాలని అన్నారు. రెండు కోట్లతో నిర్మాణం చేపట్టిన దోబిగాడ్ అసంపూర్తిగా ఉందని, వెంటనే పూర్తి చెయ్యాలని కొండగడప నుండి బుజిలాపురం వరకు బిటి వెయ్యాలని డిమాండ్ చేసారు. వర్షాలు పడుతుంన్నదున మంచినీటి ట్యాంకులు శుభ్రం చెయ్యాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని, మున్సిపాల్టీ పరిధిలోని అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, జిల్లా కమిటీ సభ్యులు రాచకొండ రాములమ్మ టౌన్ కార్యదర్శి కూరపాటి రాములు, మెతుకు అంజయ్య, కందుకూరి నర్సింహా, గుండు లక్ష్మి, అంజమ్మ, సావిత్రి, తయారా, శోభ పాల్గొన్నారు.

ఫొటో వీడియో గ్రాఫర్స్ అధ్యక్షునిగా సైదులు



నవతెలంగాణ- చిట్యాల టౌన్

చిట్యాల మండల ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం గౌరవ అధ్యక్షులు ఏళ్ల బయ్యన్న ,జిల్లా సహాయ కార్యదర్శి ముప్పా సుఖేందర్ రెడ్డి సమక్షంలో నిర్వహించారు. మండల అధ్యక్షు లుగా దేవనబోయిన సైదులు ,ప్రధాన కార్యదర్శిగా కూరాకుల సుధీర్, కోశాధికారిగా చొప్పరి లింగస్వామి ,కుటుంబ భరోసా ఇంచార్జ్ గా చిలువేరు కృష్ణ, గౌరవ సలహాదారులుగా గాలి యాదగిరి ,మెండే నరసింహ, ఉపాధ్యక్షులుగా బి.రవి సిలువేరు పరమేష్, పబ్బు సత్తయ్య, నరేష్, సహాయ కార్యదర్శులుగా గంజి వేణు, శేఖర్ ,అచ్చయ్య ప్రచార కార్యదర్శిగా జిట్టా నరేష్ కార్యవర్గ సభ్యులుగా ఉపేందర్, ప్రణయ్, మల్లేష్‌లను ఎన్నుకున్నారు.

తల్లి మృతదేహం ముందే ఆస్తి కోసం కూతుర్లు గొడవ



నవతెలంగాణ కోదాడరూరల్

మానవత్వం మంట కలిసిపోతుంది. బంధాలు, బంధు త్వాలు ఆప్యాయతలు, అనురాగాలు నేటి సమాజంలో చోటు లేకుండా పోతున్నాయి. మనిషి బతుకును అక్షరాల డబ్బే శాసిస్తోంది. డబ్బు ప్రాధాన్యతను తెలిపేలా పట్టణంలో ఓ హృదయవిదారకర ఘటన చోటుచేసుకుంది. కన్నతల్లి శవమై కండ్ల ముందే ఉన్నా కడుపున పుట్టిన ముగ్గురు బిడ్డలు తమకు రావలసిన ఆస్తి కోసం తగువపడటం పలువురుని ఆశ్చర్యాన్ని గురిచేసింది. వివరాల్లోకెళితే పట్టణంలోని పాత పోస్ట్ ఆఫీస్ వీధిలో నివాసముంటున్న వెల్దినేని నాగమణి(85) బుధవారం కాలం చేసింది. నవమాసాలు మోసిన తల్లిని కాటికి సాగనంపాల్సిన కూతుర్లే తమకు వాటాలు తేల్చాలంటూ గొడవకు దిగారు. ముగ్గురు కూతుర్ల మధ్య ఉన్న గొడవతో శవం రోడ్డుపైనే ఉంది. ముగ్గురికి తనకున్న ఆస్తిని మూడు వాటాలుగా చేసినప్పటికీ తనకున్న నాలుగో వాటాకు సంబంధించి కూతుర్లు గొడవ పడుతున్నట్లు సమాచారం.. ఆస్తికోసం కన్నతల్లిని అలా రోడ్డుపై ఉంచడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. తల్లి చనిపోకముందు 20 రోజుల నుండి ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆ తల్లి రోడ్డుపైనే ఉండి, రోడ్డుపైనే తింటూ తనువు చాలించింది. చివరకు పెద్ద మనుషులు జోక్యం చేసుకొని ఎట్టకేలకు ముగ్గురు కూతుళ్లకు అల్లుళ్లకు సర్ది చెప్పడంతో గురువారం సాయంత్రం మృతదేహానికి అంత్యక్రియలు చేశారు.



చేనేత కార్మిక సభకు తరలిన నేతన్నలు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

జిల్లాలోని పోచంపల్లి మండల కేంద్రంలో చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు, ఛలో పోచంపల్లి కార్యక్రమానికి ఆలేరు పట్టణం నుండి చేనేత కార్మికులు భారీ సంఖ్యలో గురువారం తరలివెళ్లారు. పట్టణ కేంద్రంలోని కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పద్మశ్రీ అవార్డ్ గ్రహీత చింతకింది మల్లేశం, ఆలేరు పట్టణ పద్మశాలి అధ్యక్షులు పాసికంటి శ్రీనివాస్, తాజా మాజీ అధ్యక్షులు బింగి నరసింహులు పూలమాలలు వేసి. చేనేత కళాకారులతో కలిసి భారీ ర్యాలీగా స్వామి వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. చలో పోచంపల్లి కార్యక్రమానికి భారీగా తరలి వెళ్లినట్టు ఆలేరు పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి చిక్క శ్రవణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలేరు పట్టణ పద్మశాలి సంఘం నాయకులు ఆలేరు మూడో వార్డు కౌన్సిలర్ బేతి రాములు, పద్మ సుదర్శన్,బడుగు జహంగీర్, ఆడెపు బాలస్వామి, గుజ్జ అశోక్, బేతి శ్రీనివాసు, భోగ సంతోష్, భోగ వెంకటచలం, ఎలగందుల యాదగిరి, రేగోటి వెంకటేష్, మెరుగు శ్రీధర్, రచ్చ దత్తు, ఎలగందుల ఉమా ఋషి, సత్య ఋషి, చిట్టిమెల్ల వెంకటేష్, గట్టు రాజు, కటకం లక్ష్మణ్, చింతకింది గిరి,చింతకింది కృష్ణ మూర్తి,అమృతం నర్సింలు, ఏల వెంకటేష్ ఏల చంద్రమౌళి, రచ్చ హనుమంతు, గుండు విట్టల్, బేతి ఉప్పలయ్య చింతకింది సత్యనారాయణ, చందా ఉపేందర్, చిటిమెల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ హాస్టల్ లో లైబ్రరీలకు బుక్స్ వెంటనే సరఫరా చేయాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ లైబ్రరీలు ఖాళీగా ఉన్నాయని ప్రతి కాలేజ్ హాస్టల్‌కు అవసరమైన బుక్స్ వెంటనే అందించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహాల్లో అధ్యయన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ సక్షేమ హాస్టళ్లకు పక్కాభవనాలు నిర్మించాలని, అవసరమైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కళాశాలలో పటిష్ట పరచడానికి చర్యలు తీసుకోవడంలో విఫలం చెందుతుందన్నారు. బడ్జెట్లో కేటాయింపులు కూడా నామమాత్రంగా ఉన్నాయని తెలిపారు. బీసీ జనాభా దామాషా ప్రకారంగా బడ్జెట్ కేటాయింపులు చేసి ఉంటే బాగుండేదని అందులోనూ విద్యకు అధిక నిధులు కేటాయిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. సంక్షేమ హాస్టల్స్‌లో మెనూ పాటించాలని, విద్యార్థులకు చదువు క్రమశిక్షణ విషయంలో వార్డెన్లు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొల్లు రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇది కేవలం ఎన్డీఏ పాలిత రాష్ట్రాల బడ్జెట్

నవ తెలంగాణ- కేతపల్లి

కేంద్ర ప్రభుత్వం మోడీ సర్కార్ ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్లో తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం విపక్ష చూపిందని, ఇది కేవలం ఎన్డీఏ పాలిత రాష్ట్రాల బడ్జెట్ మాదిరిగా ఉన్నది అని టీపీసీసీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎండి యూసుఫ్ జానీ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు . పోలవరానికి నిధులు ఇచ్చినప్పుడు తెలంగాణలో పాలమూరు ప్రాజెక్టుకు నిధులు ఎందుకు ఇవ్వరు? అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధి కోసం నిధులు రాబట్టేందుకు పోరాటం చేయాలన్నారు.

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి



నవతెలంగాణ-ఆలేరుటౌన్

ప్రస్తుత శాసనసభ సమావేశాలలో ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని అఖిలపక్ష కమిటీ సభ్యులు గురువారం డిమాండ్ చేశారు. ఆర్యవైశ్య భవనంలో అఖిలపక్ష కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించడన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్నా.. మంత్రులనుండి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నుండి ఎలాంటి స్పందన లేదని చెప్పారు. గతంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి 2021లోనే త్వరలో ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తున్నామని అధికారికంగా ప్రకటించారన్నారు. ఆలేరు అభివృద్ధి జరగాలంటే, రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు అయితే తప్ప వేరే అవకాశం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ పసుపునూరి వీరేశం కో కన్వీనర్లు రాచకొండ జనార్ధన్, చెక్క వెంకటేష్, కామెడీ ఉప్పలయ్య, కళ్లెపు అడవయ్య, పంగ రవి, నందగంగేష్, బాంబే రవి, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన ఎర్రబోయిన కోటయ్యయాదవ్ (49) బుధవారం రాత్రి మండల కేంద్రంలో పని ముగించుకోని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో గుంటూరు నుంచి వస్తున్న డీసీఎం వెనుక నుంచి ఢీకొంది. తీవ్ర గాయాలైన కోటయ్యను చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుమారుడు ఎర్రబోయిన హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
శుక్రవారం | జులై 26, 2024 | www.navatelangana.com

ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-చిట్యాలటౌన్



మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు బదిలీ కాగా వారికి గురువారం ఆ పాఠశాల ఆవరణలో వీడ్కోలు సన్మానంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయుడు కుర్రె శ్రీనివాస్, బదిలీపై వెళుతున్న పీఈటీ సంధ్యారాణి, రికార్డు అసిస్టెంట్ ప్రసాద్‌కు ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇన్‌చార్జ్ హెచ్ఎం వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అండాలు, షరీఫ్, వెంకట్రావు, రామ్ రెడ్డి, రేణుక, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిరేకల్ మున్సిపాలిటీలో నేటి నుండి జ్వర సర్వే

నవతెలంగాణ-నకిరేకల్



నకిరేకల్ మున్సిపాలిటీలో ఈనెల 26 నుండి జ్వర సర్వే నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి. బాలయ్య, హెచ్ఈఓ. రాపోలు రవి పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆశా వర్కర్లు, ఆర్పీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్వర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వార్డులలో పర్యటించేటప్పుడు ప్రజలకు పారిశుద్ధ్యం పై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా..పట్టించుకోరా..

- రోడ్డు కంటే ఎక్కువ వెడల్పులో రింగ్ రోడ్ డివైడర్
- నిత్యం పేలుతున్న టైర్లు ప్రమాదాలకు గురవుతున్న వాహనాలు
- ట్రాఫిక్ సిగ్నల్ లేక పోతున్న ప్రాణాలు
- ప్రమాదం పొంచి ఉన్న అంబేద్కర్ సర్కిల్ రింగ్
- డివైడర్ వెడల్పును తగ్గించాలని ప్రజల ఆవేదన

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

నిత్యం రద్దీగా ఉండే కొండమల్లేపల్లి ప్రధాన రహదారి చౌరస్తా సెంటర్ కూడలి అంబేద్కర్ విగ్రహం రింగ్ రోడ్ డివైడర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. గతంలో కోదాడ టు జడ్చర్ల రోడ్డు వెడల్పు నిర్మాణంలో భాగంగా అధికారులు చౌరస్తా సెంటర్ సర్కిల్ రింగ్ రోడ్డు డివైడర్ ను రోడ్డు వెడల్పు





విస్తీర్ణం పరిమాణం కంటే సర్కిల్ రింగు డివైడర్‌ను వెడల్పుగా నిర్మించారు. దీంతో రోడ్డు వెడల్పు తగ్గిపోవడంతో నిత్యం రహదారిపై వెళ్లే పెద్ద పెద్ద వాహనాలు రోడ్డు క్రాస్ అవుతున్న సమయంలో రోడ్డు వెడల్పు లేక వాహనాల టైర్ల పై ఒత్తిడి పెరిగి పగిలిపోతున్నాయి. బాంబు పేలినట్టు భారీ శబ్దం వస్తున్నాడంతో ప్రయాణికులు, వ్యాపారస్తులు, వాహనదారులు ప్రజలు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురవుతున్నారు. సర్కిల్ రింగ్ రోడ్డు డివైడర్ రోడ్డు పరిమాణం కంటే ఎక్కువ వెడల్పులో నిర్మించడంతో ట్రాఫిక్ సిగ్నల్ లేక రాత్రి, పగలు నిత్యం రహదారిపై వెళ్లే పలు భారీ వాహనాలు డివైడర్‌ను ఢీకొని వాహనాలు తరచు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈనెల 24న రాముని గుండ్ల తండాకు చెందినటువంటి ఓ మహిళ రోడ్డు దాటుతున్న సమయంలో లారీ రావడంతో మహిళా డివైడర్ దగ్గరికి పక్కకు జరిగినప్పటికీ రోడ్డు విస్తీర్ణం వెడల్పు లేక లారీ రోడ్ క్రాస్ అవుతున్న సమయంలో మహిళ తలకు తగిలి మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని వెంటనే అంబేద్కర్ విగ్రహ చౌరస్తా సెంటర్ సర్కిల్ రింగ్ రోడ్డు డివైడర్ వెడల్పును తగ్గించి ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే మరెన్నో ప్రమాదాలు జరిగే ప్రమాదముంది.

ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలి
వాహనదారుడు కట్కూరి సుధాకర్ ముష్టిపల్లి



కొండమల్లేపల్లి చౌరస్తా సెంటర్ సర్కిల్లో రోడ్డుపై ఉన్న వెడల్పు రింగ్ రోడ్డు డివైడర్ను కారణంగా తరచూ వాహనాలు రోడ్డు క్రాస్ అవుతున్న సమయంలో రోడ్డు వెడల్పు లేక వాహనాలు డివైన్ ను ఢీకొని టైర్లుపగిలి ప్రమాదాలు జరుగుతున్నాయి వెంటనే అధికారులు రింగ్‌రోడ్డు డివైడర్ వెడల్పు తగ్గించి ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

సర్కిల్ డివైడర్ వెడల్పును తగ్గించాలి
స్థానిక వాసి ఎండి. సమ్మద్



కొండమల్లేపల్లి చౌరస్తా సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్నటువంటి రింగ్‌రోడ్ డివైడర్ రోడ్డు పరిమాణం కంటే డివైడర్ వెడల్పుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి వెంటనే అధికారులు రింగ్ డివైడర్ పరిమాణాన్ని తగ్గించి ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు, వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా చూడాలి.



రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కంభంపాటి శంకర్

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసిందని ఎస్ఎఫ్ నల్లగొండ జిల్లా కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. నల్లగొండ లో ప్రగతి కాలేజీ లో సభ్యత్వం క్యాంపెయిన్ చేశారు.అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్ ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.3 శాతం కేటాయించారని, ఇది గత ఓటాన్ బడ్జెట్లో కేటాయించిన బడ్జెట్ కంటే తక్కువ అని పేర్కొన్నారు. గత బడ్జెట్లో విద్యారంగానికి 21,389 కోట్ల రూపాయలు కేటాయిస్తే ప్రస్తుతం 21,292కోట్లు కేటాయించారని ఈ నిధులతో ప్రస్తుతం ప్రభుత్వ విద్య ఎ మాత్రం ముందుకు సాగదన్నారు. ఉస్మానియా కు 1000కోట్లు,మహిళ యూనివర్శిటీఅభివృద్ధి కోసం. 500 కోట్లు నిధులు నిర్వహణ, బాసర ఐఐటి అభివృద్ధి, అలాగే ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలలో నూతన యూనివర్శిటీలు కోసం కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ యూనివర్శిటీలు అభివృద్ధి కోసం 500కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఈబడ్జెట్లో గత ఆరేళ్ళ నుండి పెండింగ్ ఉన్న స్కాలర్ షిప్ లు, ఫీజు రీయింబర్స్ మెంట్స్ 7 వేల కోట్ల పైగా పెండింగ్‌లో ఉన్నాయని వాటి విడుదల కోసం నిధులు కేటాయించలేదన్నారు.

పలువురిని పరామర్శించిన బీజీఆర్

నవతెలంగాణ-నకిరేకల్

మండలంలోని మంగళపల్లి గ్రామంలో విష జ్వరాలు ప్రబలడంతో గురువారం బీజీఆర్ ఫౌండేషన్ చైర్మెన్ బచుపల్లి గంగాధర్ రావు గ్రామంలో విష జ్వరాల బారినపడిన ప్రజలను పరామర్శించారు. రోగాల బారిన పడిన వరు అధైర్య పడకుండా ఉండాలని సూచించారు ఆయన వెంట బిజిఆర్ సైన్యం ప్రతినిధులు ఉన్నారు.

అనుమతి లేకుండా నడుస్తున్న హాస్పిటల్స్ సీజ్

నవతెలంగాణ-నేరేడుచర్ల



మండలకేంద్రంలో ఎటువంటి డాక్టర్స్ లేకుండా, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ లేకుండా హాస్పటల్స్ నడిపిస్తూ, ఇన్ పేషంట్ లకు ట్రీట్ మెంట్ అందిస్తున్నందున అమ్మ హాస్పిటల్, శ్రీ సాయి శ్రీనివాస హాస్పిటల్స్‌ను సీజ్ చేసినట్టు నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యధికారిణి పి. నాగిని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని హాస్పిటల్స్ నియమ నిబంధనలు పాటించి నడిపించాలని, ఎటువంటి అనుమతి లేకుండా నడిపితే మూసివేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ వో శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బడ్జెట్



నవతెలంగాణ-కొండమల్లేపల్లి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టినటువంటి బడ్జెట్ పేద ప్రజల కోసం కాకుండా కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం కొండమల్లేపల్లి పట్టణంలోని సాయి కృపా ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఆ పార్టీ నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటి బడ్జెట్ ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని కార్పొరేట్ వ్యాపార శక్తులకు అనుకూలంగా ఉందని విమర్శించారు. ఉపాధి ప్రజా సంక్షేమం అభివృద్ధి అంటూ ప్రభుత్వాలు మాటలతో ప్రజలను మోసం చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను అమలు చేయకపోతే ప్రజలను ఏకం చేసి పోరాటాలకు సిద్ధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనందు, ఆయా మండలాల మండల కార్యదర్శిలు పెరికే. విజయ్ కుమార్, గుడి గుండ్ల రాములు, ఎం. శ్రీను, నాయకులు కావలి కృష్ణయ్య, పోలే యాదయ్య, కే. చిరంజీవి, లక్ష్మమ్మ ,సుహాసిని, విజయ, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని సందర్శించిన అధికారులు

నవతెలంగాణ-నకిరేకల్

మండలంలోని మంగళపల్లి గ్రామంలో ఒగోడు పిహెచ్ సి ఆధ్వర్యంలో కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని గురువారం ఎంపీడీవో చంద్రశేఖర్, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎస్ కిరణ్ కుమార్ సందర్శించి పరిశీలించారు. గ్రామంలోని పలు వీధులను కూడా పరిశీలించారు. ఉచిత వైద్య శిబిరానికి 28 మంది హాజరు కాగా 7 మందికి జ్వరం ఉన్నట్లు గుర్తించారు. 16 మంది నుండి రక్త నమూనాలను సేకరించారు. మరో ఇద్దరికి చికెన్ గున్యా ఉన్నట్లు నిర్ధారించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ పర్వేజ్, హెచ్ ఈ ఓ రాపోలు రవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-నకిరేకల్

కట్టంగూరు మండలంలోని మల్లారం గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త దాసరి లింగయ్య అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దహన సంస్కారం నిమిత్తం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు వల్లపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మోహన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, అబ్బగోని శ్రీనివాస్ గౌడ్, వెంకన్న గౌడ్, దాసరి నాగరాజు, దాసరి లింగయ్య, దాసరి యాదయ్య, దాసరి సింహాద్రి, దండంపల్లి వెంకన్న, దాసరి సాయిలు, దాసరి చిట్టిబాబు పాల్గొన్నారు.

చండూరు డివిజన్‌కు జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలి

నవతెలంగాణ-చండూరు

నల్లగొండ జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్ష పదవి చండూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న ఆర్యవైశ్యులకు అవకాశం కల్పిం చాలని గురువారం నల్లగొండలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, అదనపు కార్యదర్శికి లక్ష్మిశెట్టి శ్రీనివాస్లకు వినతి పత్రాన్ని అందజేశారు. కొత్తగా ఏర్పడిన చండూరు రెవెన్యూ డివిజన్ కు ఈసారి కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు వినతి పత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో తేలుకుంట్ల జానయ్య, మంచుకొండ సంజయ్, తేలుకుంట్ల శేఖర్, కర్నాటి శ్రీనివాసులు, తడకమళ్ల శ్రీధర్, మిర్యాల శ్రీనివాస్, గట్టు రాజశేఖర్, తాడిశెట్టి సంతోష్, సోమ నర్సింహ్మా, ఉమాశంకర్ తదితరులు ఉన్నారు.

మత్స్యకార అడ్‌హక్ కమిటీని వెంటనే రద్దు చేయాలి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

నిబంధనలను తుంగలో తొక్కి మోసపూరితంగా ఏర్పాటు చేసిన మత్స్య పారిశ్రామిక సంఘం అడ్‌హక్ కమిటీని వెంటనే రద్దు చేయాలని మత్స్య కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకనబోయినా రమణ ముదిరాజ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా మత్స్య శాఖ జిల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టిన నరసింహారావు ను మర్యాదపూర్వకంగా కలిసి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ లో ఉన్న చెరువు మత్స్య సొసైటీలకు యుద్ధ ప్రాతిపదికన ఎన్నికలు జరిపించాలని కోరారు. నూతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటులో భాగంగా 11 మంది ప్రమోటర్లకు గాను 17 మంది పోటీలో ఉండగా కేవలం 11 మందిని ఒకేసారి నిలబెట్టి వారే గెలిచినట్లుగా అన్యాయంగా ప్రకటించారని అట్టి కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులు కొర్వి శ్రీనివాస్, జిల్లా ముదిరాజ్ నాయకులు పులకరం భిక్షం పాల్గొన్నారు.

ఫీవర్ , లార్వా సర్వే చేయాలి

- జిల్లా మలేరియా అధికారి గంగప్ప

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



ఆర్పిలు, ఆశ వర్కర్లు ఫీవర్ సర్వే తో పాటు లార్వా సర్వే కూడా చేయాలని జిల్లా మలేరియా అధికారి గంగప్ప కోరారు. గురువారం నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో ఫీవర్ సర్వే పై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీవర్ సర్వే చేసిన ఇళ్ళలో జ్వరంతో బాధపడే వ్యక్తులు ఉన్నట్లైతే వారి వివరాలు సేకరించి మరుసటి రోజు వారి గురించిన వివరాలు మరల కనుక్కోవాలి అని పేర్కొన్నారు. లార్వా నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి వెంటనే వాటిని శుభ్రపరచాలని సిబ్బందికి సూచించారు. రోజు సర్వేచేసిన 50 ఇళ్ళకు సంబందించిన వివరాలు నోట్ చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ ముసబ్ అహ్మద్ మట్లాడుతూ నేటి నుండి 48 వార్డులలో ఆర్పి లు, ఆశ వర్కర్లు కలిసి ఫీవర్ సర్వే, లార్వ సర్వే చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్లు, మెడికల్ సూపర్వైజర్లు, మెప్మా సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు సరికొత్త ఎత్తుగడ

- పేదదోవపట్టే యువత ఇక తప్పించుకోవడం కుదరదు

నవతెలంగాణ-ఆలేరుటౌన్



గంజాయ్ నిర్మూలనకు పోలీస్‌శాఖ సరికొత్త ఎత్తుగడకు శ్రీకారం చుట్టింది. గంజాయి నిర్మూలనలో భాగంగా యువతను సన్మార్గంలో పెట్టేందుకు త్వరలోనే అన్ని పోలీస్ స్టేషన్లకు గంజాయి కిట్లు రానుండగా, ఇది పోలీసులకు చేతికి సరికొత్త ఆయుధం కానుంది. గంజాయి సేవించేవారు, ఇకనుంచి తప్పించుకోలేరు. వారిని పట్టుకునేందుకు పోలీసులకు ఎట్టకేలకు ఒక కొత్త ఆయుధం చిక్కింది. గంజాయి టెస్ట్ కిట్లు త్వరలోనే అన్ని పోలీస్ స్టేషన్‌లకు చేరనున్నాయి.. డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలోనే, గంజాయి టెస్ట్ నిర్వహించి వాటికి బానిసైన వారిని పట్టుకోనున్నారు. గంజాయి కేసులలో సినీ ప్రముఖులు సైతం పట్టుబడ్డ సందర్భాలు అనేకం ఉన్నాయి. ఒకప్పుడు ముఖ్యమైన నగరాలు, పట్టణాలకే పరిమితమైన డ్రగ్స్, ఇప్పుడు మారుమూల గ్రామాలకు విస్తరించింది. కొందరైతే పెరటి తోటలో గంజాయిని సాగు చేస్తున్నారు. స్కూల్, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు సైతం గంజాయికి బానిసలు అవుతున్నారు. ఏమీ తెలియని వయసులో మత్తుకు బానిసై నేరాలకు పాల్పడుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఆంధ్ర, ఒడిస్సా బోర్డర్‌తో పాటు విశాఖ ఏజెన్సీ నుంచి గంజాయి తెలుగు రాష్ట్రాలకు పెద్ద ఎత్తున సరఫరా అవుతున్నట్లు నిఘాలో తేలింది. దీంతో తెలంగాణ పోలీసులు యాంటీ నార్కోటి బ్యూరో టీమ్లను ఏర్పాటు చేసి, గంజాయి మత్తు పదార్థాలను అక్రమ రవాణాకు చెక్ పెట్టడంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా పోలీసులు ముందంజలో ఉన్నారు. విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై, హైదరాబాద్ జాతీయ రహదారిపై కిలోల కొద్దీ కోట్ల రూపాయల విలువైన గంజాయిని పట్టుకున్నారు. మద్యం తాగి వెహికల్ నడిపే వారిని గుర్తించేందుకు, పోలీసులు బ్రీత్ అనలైజర్ ఉపయోగిస్తున్నట్లుగా, గంజాయి సేవించే వారిని గుర్తించేందుకు గతంలో ఎటువంటి మెషిన్లు అందుబాటులో ఉండేవి కావు. ఆధునిక టెక్నాలజీతో గంజాయి సేవించే వారిని సైతం గుర్తించే ఆధునిక టెక్నాలజీని గుర్తించడంతో, ఇకనుంచి గంజాయి తాగే వారు పోలీసుల నుంచి తప్పించుకోలేరు. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా నల్గొండ జిల్లా మునుగోడులో ఈ కిట్లను పరీక్షిస్తున్నారు. రెండు రోజుల క్రితం పోలీసులకు పట్టుబడిన కొందరికి టెస్ట్ కిట్లతో పరీక్షించగా, వారిలో 35 మంది గంజాయి తాగినట్లు తేలింది. దీంతో గంజాయి సప్లై చేస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. త్వరలో రాష్ట్ర మొత్తం అన్ని పోలీస్ స్టేషన్లోనూ గంజాయి కిట్లను పంపిణీ చేస్తామని వెల్లడించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలోనే ఈ కిట్లతో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. గంజాయి సరఫరా కు అడ్డాగా మారిన ధూల్ పేటను గంజాయి ఫ్రీగా మార్చాలని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్స్ డైరెక్టర్ కమలహాసన్ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. ఆగష్టు 31 లోగా ధూల్‌పేటను గంజాయిఫ్రీగా మార్చాలన్నారు. పోలీసుల సహకారంతో గంజాయి అక్రమార్కులపై ఉక్కు పాదం మోపాలన్నారు. దీంతో గంజాయి అమ్మేవారే కాదు, తాగేవారు కూడా ఇకపై ఆషామాషి కాదని గ్రహించాలి. మేము సైతం అంటూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ విద్యార్థి, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు పోలీసులతో గంజాయి నిర్మూలనకు పని చేయాలని ఆరోగ్య నిపుణులు, యువత తల్లిదండ్రులు కోరుతున్నారు.